VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ :శనివారం,22.08.2026

సంపుటి : 09 సంచిక : 74 , పెజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## రాయదుర్గ భూముల వేలంకు తొలగిన అడ్డంకులు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

పిటిషనర్ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను (WP No 1028/2026) గౌరవనీయ సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాయదుర్గ్‌లో TGIIC నిర్వహిస్తున్న వేలం ప్రక్రియను సవాలు చేస్తూ పిటిషనర్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే, భారత ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులైన జస్టిస్ సూర్యకాంత్, గౌరవనీయులైన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ మరియు గౌరవనీయులైన జస్టిస్ మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీనితో రాయదుర్గం భూముల వేలంకు అడ్డంకులు తొలగినాయి.

# యోగితో బండి భేటీ

- దాదాపు అరగంటకుపైగా మాట్లాడిన యూపీ సీఎం
- తెలంగాణలో బీజేపీ పరిస్థితిపై ఆరా
- తెలంగాణ అభివృద్ధికి మోదీ పూర్తిగా సహకరిస్తుంది
- డబుల్ ఇంజిన్ సర్కారొస్తే తెలంగాణను అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవచ్చు
- మోదీ సహకారంతో ఉత్తర ప్రదేశ్ అభివృద్ధి చేసుకుంటున్నాం
- మళ్లీ యూపీలో అధికారం బీజేపీదే
- మోదీ నాయకత్వంలో యూపీలోనూ వరుసగా 3వ సారి కాషాయ జెండా ఎగరేస్తాం
- కలిసికట్టుగా పనిచేస్తే తెలంగాణలోనూ బీజేపీ గెలుపు తథ్యం

**లక్నో వెలుతురు ఆగస్టు 21:**



ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం రోజున సాయంత్రం ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను కలిశారు. కేంద్ర పారామిలటరీ అయిన సశస్త్ర సీమా బల్ కు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నేరుగా లక్నోలోని సీఎం అధికార నివాసానికి వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. దాదాపు అర గంటకుపైగా వీరిద్దరి భేటీ జరిగింది. ప్రధానంగా తెలంగాణలో పార్టీ పరిస్థితి, యూపీ ఎన్నికలపై చర్చ జరిగింది. తెలంగాణ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూర్తిగా సహకరిస్తున్నారని యోగి తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే తెలంగాణకు మరింత మేలు జరుగుతుందని ఉత్తర ప్రదేశ్ ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. యూపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ కొనసాగడంవల్ల మోదీ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

▶ మిగతా 2లో

## సరిహద్దు నిర్వహణ ఆధునీకరణ కు ఎస్ఎస్ బీ క్రుషి భేష్

- వ్యవస్థీక్రుత నేరాల నియంత్రణలో ఎస్ఎస్ బీ సేవలు అభినందనీయం
- సంక్షేమ కార్యక్రమాల్లోనూ ఎస్ఎస్ బీ ముందంజ
- జవాన్ల సంక్షేమానికి మోదీ సర్కార్ కు అత్యంత ప్రాధాన్యత
- అత్యాధునిక టెక్నాలజీ వినియోగంలోనూ అగ్రభాగాన ఎస్ఎస్ బీ
- విపత్తు సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లోనూ ఎస్ఎస్ బీ సేవలు భేష్
- జవాన్ల త్యాగాలను దేశం ఎప్పటికీ మరచిపోదు
- జవాన్ల జీవన ప్రమాణాల పెంపుకు చిత్తశుద్దితో క్రుషి చేస్తున్నాం



- లక్నోలో ఎస్ఎస్ బీ నూతన భవనాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన బండి సంజయ్

2

**లక్నో వెలుతురు ఆగస్టు 21:**

భారత్–నేపాల్, భారత్–భూటాన్ దేశాల మధ్య ఉన్న సుమారు 2,450 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుకు భద్రత కల్పించే విషయంలో ఎస్ఎస్ బి సేవలు అభినందనీయమని

## గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ

**సిఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 21:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ – ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ – ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం



2

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

## విడుదలైన ప్రతి రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే

- రూ.5 వేల కోట్లతో సీఎం సంకల్పించిన లక్ష్యం నెరవేరాలి
- భూసేకరణ, ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లింపుల్లో కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పనిచేయాలి
- తక్షణమే పంపిణీకి సిద్ధంగా ఉన్న దాదాపు రూ.1,200 కోట్లు



**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 21:**

2

## సర్కారు దూరదృష్టి రాయదుర్గంలో భూముల ధర రికార్డు బ్రేక్

- ప్లాట్ పీ1కు ఎకరాకు రూ.264 కోట్ల భారీ ధర
- ఇటీవల కాలంలో హైదరాబాద్‌లోనే అత్యధిక ధర ఇది

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21, 2026:**

రాయదుర్గంలోని భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ–వేలంలో ప్లాట్ నంబర్ పీ1 ఎకరా రూ.264 కోట్ల రికార్డు ధర పలికింది. హైదరాబాద్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ సంస్థ నిర్వహించిన భూముల వేలంలో ఇదే అత్యధిక ధరగా నిలిచింది. మొత్తం 5.25 ఎకరాల భూమి విక్రయం ద్వారా టీజీఐఐసీకి రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది.రాయదుర్గంలోని పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.175 కోట్ల రిజర్వ్ ధర నిర్ణయించారు. అయితే, పోటాపోటీగా సాగిన వేలంలో చివరకు ఎకరాకు రూ.264 కోట్ల ధర పలికింది.

2

## ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

- ఎల్‌నినో సవాళ్లను విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలి
- అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం..
- పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి
- భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి
- ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉంది
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి..
- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- రైతులకు మంచి చేయాలన్న చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారు



2

- ప్రయత్నం చేస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదు.. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- తెలంగాణను ఎల్‌నినో ప్రభావం నుంచి కాపాడేందుకు ముందుగానే ప్రణాళికతో ప్రభుత్వం పనిచేస్తోంది

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

## ఆక్స్‌ఫర్డ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి



11

- దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు.

**వెలుతురు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆగస్టు 21:**

ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్మాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు.ఆక్స్‌ఫర్డ్ యూ నివర్సిటీ పరిధిలోని బ్లావా ట్ని క్ స్కూల్ ఆఫ్ గవర్న మెంట్‌నుము ఖ్యమంత్రి సందర్శించారు.

## ఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు...

- లండన్‌లోనే కొనసాగనున్న అధికారిక షెడ్యూల్!

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**



11

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం యూకేలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం సమావేశాలు యథావిధిగా కొనసాగుతాయి.

## తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టండి

- ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి సీఎం రేవంత్ ఆహ్వానం
- 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విద్యావేత్తలతో ముఖ్యమంత్రి సమగ్ర చర్చలు
- తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులు



11

## పేదల సంక్షేమం.. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత

- సెప్టెంబర్ 15లోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.
- సర్వే మ్యాప్ తో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు
- జగిత్యాల జిల్లా పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

11



**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 21:**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## ఆసియా ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన తెలంగాణ కరాటే క్రీడాకారులకు టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

ప్రతిష్మాత్మక 2026 AKF క్యాడెట్, జూనియర్ & U-21 ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణకు చెందిన నలుగురు కరాటే క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ కరాటే–దూ అసోసియేషన్ అధ్యక్షులు, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు క్రీడాకారులను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో సన్మానించి అభినందించారు.జోర్డాన్‌లోని అమ్మాన్‌లో సెప్టెంబర్ 4 నుంచి 11 వరకు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో విషాల్ రెడ్డి అమ్రాడి (-61 కేజీ), సత్య తేజ బ్రహ్మాండాని (+66 కేజీ), నిష్ఠ గంగిసెట్టి (-61 కేజీ), శశాంక్ సాత్విక్ లంకె (-52 కేజీ) తెలంగాణ తరపున పోటీపడనున్నారు.ఆసియా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి తెలంగాణకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.



క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లను కూడా ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ హెడ్ కోచ్, KIO జాయింట్ సెక్రటరీ కీర్తన్,కరాటే స్టేట్ జనరల్ సెక్రటరీ మల్యాల రామస్వామి, కోచ్ నరేష్, ఎం. రాజు పాల్గొన్నారు.

▶ మిగతా 11లో

# యోగితో బండి భేటీ

తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడితే రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ప్రజల కు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీజేపీకి సానుకూల వాతావరణం ఉందని, నాయకులంతా కలిసికట్టుగా పని చేస్తే అధికారంలోకి కచ్చితంగా వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలో ఉత్తర ప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయని, మోదీ నాయకత్వంలో ముచ్చటగా మూడవ సారి కాషాయ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# సర్కారు దూరదృష్టి రాయదుర్గంలో భూముల ధర రికార్డు బ్రేక్

ఇది రిజర్వ్ ధర కంటే దాదాపు 51 శాతం అధికమని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌పై ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, జాతీయ స్థాయి డెవలపర్ల విశ్వాసం ఎంతగా పెరిగిందో ఈ వేలం ఫలితం స్పష్టం చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. రాయదుర్గంలో భూముల విలువ వేగంగా పెరుగుతున్నదానికి ఈ వేలం మరో ఉదాహరణగా నిలిచిందని స్పష్టం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో టీజీఐఐసీ గత మేలో నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.237 కోట్లు పలికింది. కేవలం మూడు నెలల్లోనే ఆ రికార్డును అధిగమిస్తూ ఇప్పుడు పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.264 కోట్ల ధర రావడం విశేషం. హైదరాబాద్‌లోని కీలక వ్యాపార ప్రాంతాలు, మౌలిక సదుపాయాలపై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరుగుతున్నదానికి ఇది నిదర్శనమని భావిస్తున్నారు.ఎంఎస్‌టీసీ ఈ–ఆక్షన్ వేదిక ద్వారా పూర్తి పారదర్శకంగా వేలం నిర్వహించారు. ప్రముఖ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్‌ఎల్ ప్రత్యేక ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా వ్యవహరించింది. జాతీయ స్థాయి ప్రముఖ డెవలపర్లు పోటీలో పాల్గొనడంతో వేలం అత్యంత పోటీతత్వంతో సాగింది. ఈ సందర్భంగా టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక ఐఏఎస్ మాట్లాడుతూ.. పీ1 ప్లాట్ వేలం విజయవంతం కావడం తెలంగాణ భవిష్యత్తుపై డెవలపర్‌లకున్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇది కేవలం భూమికి మంచి ధర రావడం మాత్రమే కాదని, పారదర్శకత, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్న తెలంగాణ అభివృద్ధి విధానానికి లభించిన గుర్తింపు అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి వ్యాపార, పెట్టుబడుల కేంద్రంగా వేగంగా ఎదుగుతున్నదని ఈ వేలం మరోసారి నిరూపించిందన్నారు. ఈ విజయానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అందిస్తున్న దూరదృష్టితో కూడిన నాయకత్వమే కారణమని టీజీఐఐసీ కృతజ్ఞతలు తెలిపింది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొంది. ఈ ఫలితాలతో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి పెట్టుబడి కేంద్రాల సరసన మరింత బలంగా నిలిచిందని తెలిపింది.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని TGIRDలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు VB-G RAM-G, సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు.ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు.జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు.రైతులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చన్నారు.తెలంగాణను దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, రైతులకు లాభదాయకమైన వ్యవసాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యాన రంగాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణను పొరుగు రాష్ట్రాలకు దీటుగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం తదితర అంశాలపై నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ఆరు నెలలుగా వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు రైతాంగ సమస్యలపై నిరంతరం చర్చిస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువులు, అటవీ జంతువులకు కూడా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గతంలో కరువు పరిస్థితుల్లో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసినట్లుగానే, అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు కూడా నీటి సదుపాయం కల్పించాలని అన్నారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి" అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. "ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్ – ప్రతి రైతుకు నీటి భద్రత – ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం" అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

**మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్స్...**

- **గతంలో కూడా దేశంలో ఎల్ నినో ప్రభావాలు వచ్చాయి.**
- **1951 నుంచి నేటి వరకు 12సార్లు ఎల్ నినోను భారత దేశం ఎదుర్కొంది.**
- **ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణ ద్వారా ఎల్ నినోను సమర్థవంతంగా అధిగమించింది.**
- **కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి.**

# సరిహద్దు నిర్వహణ ఆధునీకరణ కు ఎస్ఎస్ బీ కృషి భేష్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ముఖ్యంగా సరిహద్దు నిర్వహణను ఆధునికీకరించే దిశగా సశస్త్ర సీమా బల్ నిరంతరం కృషి చేస్తుండటం సంతోషదాయకమన్నారు. డ్రోన్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, GPS ఆధారిత గస్తీ, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, GIS ఆధారిత ప్రణాళిక వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా SSB తన కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుండటం అభినందనీయమన్నారు. ఉత్తర ప్రదేశ్ పర్యటనలో భాగంగా శుక్రవారం రోజున లక్నోలోని ఎస్ఎస్ బీ కేంద్రానికి వచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు సైనిక వందనం సమర్పించారు. అనంతరం నేరుగా గోమతినగర్ లోని మోహన్ లాల్ గంజ్ లో ఉన్న సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్ బి) 4వ బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన జవాన్ల బ్యారక్, సబార్డినేట్ అధికారుల మెస్, నివాస భవనాలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. దీంతోపాటు గోరఖ్‌పూర్‌లోని రీజినల్ హెడ్‌క్వార్టర్స్, ట్రైనింగ్ సెంటర్, జాయింట్ హాస్పిటల్, మహారాజ్‌గంజ్‌లోని 22వ బెటాలియన్ భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఆయా భవనాల నిర్మాణానికి కేంద్రం రూ.191 కోట్ల 29 లక్షలను మంజూరు చేసింది. ఆయా నిధులతో జవాన్ల బ్యారక్‌లు, పరిపాలనా /శిక్షణ భవనాలు, ఆసుపత్రి, సిబ్బంది నివాసాలు, రోడ్లు, STP, నీటి ట్యాంకులు, ప్రహరీ గోడలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు ఎస్ఎస్ బీ ఏడీజీ రేఖా లోహాని, ఐజీలు మీనూ చౌదరి, పారుల్ జైన్, సీపీడబ్ల్యూ సీఈ హిమాంశు పాండే తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి ప్రసంగంలోని ముఖ్యాంశాలు...+శుక్రవారం రోజున సశస్త్ర సీమా బల్ ముఖ్యమైన కార్యక్రమంలోని పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం సంతోషంగా ఉంది. కేంద్ర సాయుధ పోలీసు బలగాల జవాన్లు, వారి కుటుంబాల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకున్న భారత ప్రభుత్వ ఆలోచనకు, నిబద్ధతకు నేటి ప్రారంభోత్సవాలు ప్రతీకలు. దేశ సరిహద్దుల్లో నిలబడి దేశ భద్రతను కాపాడే జవాన్ల కుటుంబాలకు కూడా సురక్షితమైన, గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యతని విశ్వసిస్తున్నాం. జవానుకు తన కుటుంబ భద్రత, ఆరోగ్యం, సౌకర్యాల గురించి ఆందోళన లేకుండా ఉంటే, అతను సరిహద్దు భద్రత, దేశ సేవ అనే తన బాధ్యతలపై పూర్తి ఏకాగ్రతతో దృష్టి పెట్టగలడు. భారతదేశ భద్రతా వ్యవస్థలో సశస్త్ర సీమా బల్ (SSB) పాత్ర ఎంతో ముఖ్యమైనది. భారత్–నేపాల్, భారత్–భూటాన్ దేశాల మధ్య ఉన్న సుమారు 2,450 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుకు భద్రత కల్పించే బాధ్యత ఎస్ఎస్ బిపై ఉంది. ఈ సరిహద్దు ద్వారా మాదకద్రవ్యాలు, ఆయుధాలు, మానవ అక్రమ రవాణా, అక్రమ వలసలు, నకిలీ కరెన్సీ, వన్యప్రాణుల అక్రమ రవాణాసహా ఇతర వ్యవస్థీకృత నేరాలను ప్రోత్సహించే వ్యక్తులు, సంస్థలపై ఎస్ఎస్ బీ నిరంతరం సమర్థవంతమైన కఠిన చర్యలు తీసుకుంటోంది. గతంలో పోలిస్తే ఈ రోజుల్లో భద్రతా సవాళ్లు మరింత క్లిష్టంగా మారాయి. నేరస్థులు, దేశ వ్యతిరేక శక్తులు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లు, సైబర్ మార్గాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ఆధునిక సాంకేతిక పరికరాల వల్ల భద్రతా బలగాల ముందు కొత్త సవాళ్లు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం మనకు అవసరంగా మారింది. సరిహద్దు నిర్వహణను ఆధునికీకరించే దిశగా సశస్త్ర సీమా బల్ నిరంతరం కృషి చేస్తుండటం సంతోషంగా ఉంది. డ్రోన్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, GPS ఆధారిత గస్తీ, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, GIS ఆధారిత ప్రణాళిక వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా SSB తన కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది.దేశంలో వరదలు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు యూనిఫాం ధరించిన భద్రతా బలగాల పాత్ర కీలకమైనది. అత్యవసర పరిస్థితుల్లో త్వరగా స్పందించేందుకు SSBలో 18 సహాయక, రక్షణ బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండటం ఎంతో సంతోషంగా ఉంది. SSB సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం చాలా అభినందనీయం. వైద్య శిబిరాలు, విద్యా సాయం, నైపుణ్యాభివృద్ధి, క్రీడా కార్యక్రమాలు, మహిళా సాధికారత, వివిధ అవగాహన కార్యక్రమాలు కేవలం సామాజిక కార్యక్రమాలు మాత్రమే కావు. ఇవి సరిహద్దు ప్రజల, భద్రతా బలగాల మధ్య నమ్మకానికి బలమైన పునాది వేస్తాయి. అప్రమత్తంగా ఉండే ప్రజలు భద్రతా బలగాలకు ఎంతో సహాయం చేయగలరు. సరిహద్దు ప్రాంత ప్రజలు కూడా దేశ భద్రతలో తాము భాగస్వాములమని భావించేలా, దేశ రక్షణలో తమ పాత్రను అర్థం చేసుకునేలా మనం వారిలో నమ్మకాన్ని మరింత పెంచాలి.సశస్త్ర సీమా బల్ సాధించిన విజయాలను ప్రస్తావించేటప్పుడు, దేశ సేవలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వీర జవాన్లను గుర్తు చేసుకోకుండా అది పూర్తికాదు. సశస్త్ర సీమా బల్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు 51 మంది సిబ్బంది సరిహద్దు భద్రత, అంతర్గత భద్రతా కార్యకలాపాల్లో తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఆ అమర వీరులందరికీ నేను వినమ్రంగా నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి, గౌరవం, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ వీర జవాన్ల త్యాగాలను దేశం ఎప్పటికీ మరచిపోదు. రాబోయే రోజుల్లో కూడా సశస్త్ర సీమా బల్ (SSB) అనేక రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందని నేను ఆశిస్తున్నాను. అందులో ముఖ్యంగా తెరిచి ఉన్న అంతర్జాతీయ సరిహద్దులకు సమర్థవంతమైన భద్రత కల్పించడం, ఆధునిక సాంకేతికతను గరిష్ఠంగా ఉపయోగించడం, అంతర్గత భద్రత మరియు ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో సమర్థవంతంగా పనిచేయడం, విపత్తుల సమయంలో సహాయక మరియు రక్షణ కార్యక్రమాల ద్వారా మానవ సేవ చేయడం వంటివి ఉన్నాయి. అలాగే సరిహద్దు ప్రాంత ప్రజలతో నమ్మకం మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, తేనెటీగల పెంపకం వంటి జీవనోపాధి కార్యక్రమాల ద్వారా స్వయం సమృద్ధిని ప్రోత్సహించడం, మొక్కలు నాటడం మరియు పర్యావరణ పరిరక్షణ, భారత్ దర్శన్ కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యతను పెంపొందించడం, మిల్లెట్స్, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, అలాగే మన జవాన్లు మరియు వారి కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆశిస్తున్నాను.ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఆధునీకరణ, కొత్త సాంకేతికతపై శిక్షణతో పాటు, జవాన్లు, వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి పూర్తిగా కట్టుబడి ఉంది. జవాన్ల కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆధునిక నివాసాలు, మెస్ సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి పిల్లలకు మంచి విద్య అందించేందుకు ఆధునిక పాఠశాలలు మరియు క్రీడా పోటీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. దీని ద్వారా మన అన్ని సాయుధ పోలీసు బలగాలు మానసికంగా మరింత బలంగా తయారై, పూర్తి సామర్థ్యంతో తమ విధులను నిర్వహించేలా చేయడం మా లక్ష్యం.

# విడుదలైన ప్రతి రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే

- **పరిపాలనా జాప్యానికి తావులేదు... ఒకటి రెండు రోజుల్లోనే చెల్లింపులు**
- **అటవీ అనుమతుల అడ్డంకులనూ యుద్ధప్రాతిపదికన తొలగించాలి**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 21:**

భూమిని కోల్పోయిన రైతుకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం సకాలంలో అందకపోతే నిధులు మంజూరు చేసిన లక్ష్యమే నెరవేరదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి రూపాయి అంతిమంగా భూమి కోల్పోయిన రైతు, నిర్వాసిత కుటుంబం ఖాతాలోకి చేరాల్సిందేనని, కలెక్టర్ల పీడీ ఖాతాల్లో నిధులు ఉండిపోవడం వల్ల ప్రయోజనం లేదని తేల్చిచెప్పారు.రాష్ట్రంలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతికి అడ్డంకిగా మారిన భూసేకరణ, పునరావాసం–పునర్నిర్మాణం (ఆర్‌అండ్‌ఆర్), అటవీ అనుమతులు తదితర సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన పత్రాలు, లబ్ధిదారుల వివరాలు పూర్తిగా ఉన్న చోట ఒకటి రెండు రోజుల్లోనే పరిహారం రైతులు, నిర్వాసితుల ఖాతాల్లో జమ కావాలని ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ భూములకు సంబంధించిన చెల్లింపులు తదితర సమస్యలు అడ్డంకిగా ఉండకూడదన్నది ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి రూ.5 వేల కోట్లను కేటాయించారని తెలిపారు. ఇంత పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చినప్పుడు ఆ నిధులు క్షేత్రస్థాయిలో బాధితులకు చేరేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు."నిధులను కలెక్టర్ల పీడీ ఖాతాల్లో జమ చేయడంతో ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు. ఆ డబ్బు భూమిని ఇచ్చిన రైతుకు, నిర్వాసిత కుటుంబానికి చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. మంజూరు నుంచి లబ్ధిదారుడి ఖాతాలో జమయ్యే వరకు మధ్యలో ఉన్న ప్రతి అనవసర పరిపాలనా అడ్డంకినీ తొలగించాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ తదితర అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2,782 కోట్లు విడుదల చేయగా, సుమారు రూ.566 కోట్లు లబ్ధిదారులకు చేరాయని సమీక్షలో వెల్లడైంది. మరో రూ.989 కోట్లు వివిధ దశల్లో చెల్లింపుల ప్రక్రియలో ఉండగా, రూ.199 కోట్లు జిల్లాల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉందని అధికారులు వివరించారు.ఈ లెక్కల ప్రకారం దాదాపు రూ.1,200 కోట్లను తక్షణమే లేదా స్వల్ప పరిపాలనా ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని రైతులు, నిర్వాసితుల ఖాతాల్లోకి చేర్చడాన్ని అత్యవసర కార్యక్రమంగా చేపట్టాలని కలెక్టర్లు, నీటిపారుదల అధికారులను ఆదేశించారు. అదనంగా సుమారు రూ.455 కోట్లకు సంబంధించిన టోకెన్లు క్లియర్ అయి తదుపరి ప్రక్రియలో ఉన్నాయని సమీక్షలో వెల్లడైంది.నిధులు విడుదల కావడం ఒక దశ మాత్రమేనని, అవి వాస్తవంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావడమే అసలు ఫలితమని మంత్రి అన్నారు. విడుదలైన నిధులకు, రైతులకు జరిగిన వాస్తవ చెల్లింపులకు మధ్య ఉన్న అంతరాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.కలెక్టర్ల పీడీ ఖాతాల్లోకి డబ్బులు వచ్చిన తరువాతే భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టాలనే పద్ధతికి స్వస్తి పలకాలని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియ, కన్సెంట్ అవార్డులు, అవార్డు నంబర్లు, టోకెన్ల జనరేషన్ వంటి ప్రక్రియలన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అవార్డు నంబర్లు, టోకెన్ వివరాలు సిద్ధమైన వెంటనే అవసరమైన నిధుల విడుదల కోసం నీటిపారుదల శాఖ ఆర్థిక శాఖతో సమన్వయం చేస్తుందని తెలిపారు.జగిత్యాల జిల్లాలో భూసేకరణ కోసం ఇప్పటికే జమ చేసిన నిధులను ఒకటి రెండు రోజుల్లోనే పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు వారం రోజుల సమయం కావాలన్న అధికారుల అభ్యర్థనను ఆయన అంగీకరించలేదు. నిధులు అందుబాటులో ఉండి, లబ్ధిదారుల వివరాలు సిద్ధంగా ఉన్నప్పుడు పరిహారం చెల్లింపును వారం రోజులపాటు నిలిపివేయడానికి కారణం ఉండదని స్పష్టం చేశారు.సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ ఫీడర్ కెనాల్‌తో పాటు ఇతర పనులకు అవసరమైన సుమారు 180 ఎకరాల భూసేకరణకు సంబంధించిన కన్సెంట్ అవార్డులను మొత్తం ఆర్థిక ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ భూసేకరణ అంశాన్ని కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. రైతులతో జరిగిన చర్చలకు అనుగుణంగా కన్సెంట్ అవార్డులు, సవరించిన పరిహార అంచనాలను వేగంగా పూర్తి చేయాలని, భూసేకరణ సమస్యల కారణంగా ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు.అటవీ అనుమతులకు సంబంధించిన అడ్డంకులపైనా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు.శాఖల మధ్య సమన్వయ లోపం లేదా అవసరమైన సమాచారం అందించడంలో జాప్యం కారణంగా నీటిపారుదల పనులు నిలిచిపోవడానికి వీల్లేదన్నారు. జిల్లా కలెక్టర్లు రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు ఇతర నీటిపారుదల పథకాలకు సంబంధించిన అటవీ సమస్యలను సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు.భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. "ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతు పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకూడదు. ప్రభుత్వం వద్ద నిధులున్నప్పుడు పరిపాలనా జాప్యం కారణంగా బాధితుడు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదు. ప్రాజెక్టు ముందుకు సాగాలి... రైతుకు న్యాయం జరగాలి —— రెండూ ఒకేసారి సాధించాలి" అని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజనీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఈఎన్‌సీ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం & క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ

ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర–సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పో (Expos)లను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ – ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ శ్రీ అజిత్ రెడ్డి, శ్రీ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# చంతయ్యపల్లిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి కాలువల ద్వారా నీరు అందిస్తాం
- చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు నెల రోజుల్లో రోడ్డు పూర్తి చేస్తాం
- ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం - మంత్రి పొన్నం ప్రభాకర్

**చంతయ్యపల్లి వెలుతురు ఆగస్టు 21:**
హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం చంతయ్యపల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులను మంత్రి స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### చంతయ్యపల్లి గ్రామ ప్రగతి నివేదిక

- ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంతయ్యపల్లి గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని అధికారులు వివరించారు.
- గ్రామంలో 68 పెన్షన్ల ద్వారా రూ.18.8 లక్షల లబ్ధి అందుతోంది.
- రైతు భరోసా కింద 252 మంది రైతులకు రూ.1.52 కోట్లు విడుదలయ్యాయి.
- రైతు భీమా కింద ముగ్గురు రైతుల కుటుంబాలకు రూ.15 లక్షలు అందించారు.



- 14 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.1.56 లక్షలు విడుదలయ్యాయి.
- 17 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.87.69 లక్షలు విడుదలయ్యాయి.
- గ్రామంలో 6 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. రెండో దశలో మరిన్ని ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది.
- 93 కుటుంబాలకు మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ అందుతోంది.
- గ్రామంలో 52 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి.

### ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించాలి

గ్రామంలో ఆయిల్‌ఫామ్ సాగును విస్తరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు."జల సిరి" పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 సహాయం అందిస్తుందని తెలిపారు. పంట పొలాల్లో ఫామ్ పౌండ్లు నిర్మించుకుంటే రూ.1.30 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు.

### గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి సాగునీరు అందిస్తాం

హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా నీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

"గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే నేను ఓట్లు అడగను" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో మూతపడిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అవసరమైతే నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



### పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్‌ఐవీ తదితర అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### గ్రామ అభివృద్ధికి హామీలు

- చంతయ్యపల్లి గ్రామ ప్రజలు కోరిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.
- అంగన్వాడీకి నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- గ్రామంలోని అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు రోడ్డును నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.
- గ్రామంలో స్టీల్ బ్యాంక్‌ను వినియోగించాలని ప్రజలకు సూచించారు.
- మహిళా భవనం కోసం స్థలం అందుబాటులో ఉంటే వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు.
- గ్రామ పంచాయతీ భవనంలో ఫ్లోరింగ్, బాత్రూమ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- ఆలయానికి బోర్ ఏర్పాటు చేయాలని వచ్చిన విజ్ఞప్తిపై కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా సునీత , జిల్లా అధికారులు, మండల అధికారులు,గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాలు పాల్గొన్నారూ

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలు సన్నద్ధం: మంత్రులు తుమ్మల, సీతక్క, వాకిటి శ్రీహరి

- రాజేంద్రనగర్‌లో ని TGIRD లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్
- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్సైట్ ను ఆవిష్కరించిన మంత్రులు
- గ్రామానికి సంబంధించిన సమగ్ర వివరాలు వెబ్ సైట్ లో ఉంచే ఏర్పాట్లు

**రాజేంద్రనగర్, వెలుతురు ఆగస్టు 21:**
ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డా. ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి తెలిపారు. రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కంటే ముందుగానే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని పేర్కొన్నారు.రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, వివిధ ప్రభుత్వ రంగాల్లో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, అనిమల్ హస్బెండరు సెక్రటరీ ఇలమ్ బర్తి , టీజీఐఆర్డీ సీఈవో నిఖిల హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాష, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి కొర్ర లక్ష్మి, ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని కేవలం విపత్తుగా చూడకుండా ముందస్తు ప్రణాళికతో అవకాశంగా మలుచుకోవాలని మంత్రులు సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి శాఖకు విడివిడిగా కాకుండా వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, స్వల్పకాలిక అవసరాలతో పాటు వచ్చే ఐదు, పది సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను ఎంపిక చేయాలని సూచించారు.వీబీ–జీ రామ్‌జీ నిధులను యాదృచ్ఛికంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని, ఉపాధి హామీ నిధులతో శాశ్వత సామాజిక ఆస్తులను నిర్మించాలని మంత్రులు సూచించారు. నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి గ్రామానికి ఊట కుంట వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. పంట కుంటల ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయం, చేపల పెంపకం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.గ్రామాభివృద్ధి ప్రణాళికలు ప్రజల భాగస్వామ్యంతో, గ్రామసభల నుంచే రూపొందాలని, ప్రతి పనికి జియో ట్యాగింగ్ చేయాలని, ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడే, ఒకే పనితో అనేక ప్రయోజనాలు కలిగే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.



### మంత్రి సీతక్క

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలని, జీపీఎస్‌ఏపీ కేవలం ఒక డాక్యుమెంట్ కాదని, అది గ్రామ భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలు గ్రామసభల నుంచే రావాలని, ఐదు, పది సంవత్సరాల దృష్టితో గ్రామాల భవిష్యత్తును ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయంతో ఒకే పనికి అనేక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న క్షేత్రస్థాయి అధికారులు రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.రాష్ట్రంలో ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపనలు చేశారని, వాటి నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్‌సైట్‌ను మంత్రులు, సీఎస్ ప్రారంభించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, చేపట్టాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు ఇందులో ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి.



### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గ్రామస్థాయిలో అనుబంధం ఉన్న అన్ని శాఖలను ఏక తాటిపైకి తీసుకువచ్చి సమావేశం నిర్వహించడం అభినందనీయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.జిల్లాస్థాయిలో కూడా అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని, తమ కోసం అధికారులు కష్టపడి పనిచేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు. ప్రజల మేలు కోసం పనిచేసే అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు.ఉపాధి హామీ నిధులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, నీటి సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా, దాని ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. భారీ ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ సుమారు 30 లక్షల బోర్లపై సాగు ఆధారపడి ఉందని, అందువల్ల భూగర్భ జలాలను పెంచే పనులను ఉపాధి హామీ ద్వారా విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని, గత రెండేళ్లలో లక్ష ఎకరాల్లో పామాయిల్ సాగును పెంచామని, ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలను పెంచడమే లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అధికారులు పనిచేయాలని సూచించారు.

### మంత్రి వాకిటి శ్రీహరి

గతంలో కూడా దేశం ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొందని, 1951 నుంచి ఇప్పటి వరకు భారత్ 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కరువును ఎలా ఎదుర్కోవాలో రైతులకు అవగాహన ఉన్నప్పటికీ, ఆ అవగాహనను ఆచరణలో పెట్టేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, తెలంగాణ కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.కరువు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చేపల పెంపకానికి అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయాలని సూచించారు. మేకలు, గొర్రెల మేత కోసం ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి కేటాయించడం ద్వారా పశుసంపదను పెంచుకోవచ్చన్నారు.ఎలాంటి కరువు పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగే రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలని, భరోసా కల్పించాలని అన్నారు. ముందస్తు ప్రణాళికతో తెలంగాణను దేశానికే ఒక మోడల్‌గా నిలపవచ్చని పేర్కొన్నారు.

### సీఎస్ సంజయ్ జాజు

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో విస్తృతంగా వరి సాగు ప్రారంభమైందని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఇంకా సుమారు 20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.సెప్టెంబర్‌లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెరి–అర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పూల సాగును ప్రోత్సహించాలని, వాటికి అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.వీబీ–జీ రామ్‌జీ ద్వారా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో పక్కా ప్రణాళిక ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వర్క్‌షాప్‌కు హాజరైన అన్ని శాఖల అతో పనిచేయాలని సూచించారు.



### ఎంపీ వేం నరేందర్‌రెడ్డి

ప్రజలకు అవసరమైన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కేవలం టార్గెట్లు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అవసరం లేని పనులు చేపట్టవద్దని సూచించారు.వీబీ–జీ రామ్‌జీ కింద కేవలం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులు చేపట్టాలని అన్నారు. రైతులు వేసిన పంటలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, క్షేత్రస్థాయిలో విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల రూపురేఖలు మార్చే విధంగా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని ఆయన అన్నారు. వర్క్‌షాప్‌లో పలువురు సర్పంచులు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సహకారం గురించి వివరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వెబ్సైట్ కార్యక్రమాన్ని మంత్రులు ఆవిష్కరించారు. ఆ గ్రామానికి సంబంధించిన సమగ్ర వివరాలు అందులో పొందు పరచనున్నారు. గ్రామ జనాభా, అవసరాలు వనరులు, గ్రామ అభివృద్ధి ప్రణాళిక, శాఖలగా జరుగుతున్న అభివృద్ధి పనులు వంటి సమగ్ర వివరాలు వెబ్సైట్లో అందుబాటులో ఉంచనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కిషోర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీల సమగ్ర వివరాలు అందుబాటులో ఉండే విధంగా ప్రతి గ్రామానికి ఒక వెబ్సైట్ను సిద్ధం చేస్తున్నామ్మనారు. గ్రామా అభివృద్ధికి సంబంధించిన నిధులు అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలో అగ్రగామిగా, స్వయం సమృద్ధిగా, అనుబంధ శాఖలతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు.



# పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకానికి మద్దతు తెలిపిన ఒలింపియన్ జ్వాలా గుత్తా

- **క్రీడారంగాన్ని మార్చే ఈ పథకం ఎప్పుడో రావాల్సింది: జ్వాలా గుత్తా**
- **2026 - 31 సంవత్సరాల కాలానికి పునరుద్ధరించిన పథకానికి గతంలో కంటే 8 రెట్లు అదనంగా రూ.29,054 కోట్ల నిధుల కేటాయింపు - ఈ పథకం ద్వారా మద్దతు పొందే క్రీడాకారుల సంఖ్యను 10 రెట్లు పెంచాలని లక్ష్యం**
- **కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్య నమూనాగా ఖేలో ఇండియా పథకం - క్రీడాకారులను కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దే ప్రక్రియకు అనుగుణంగా నిధుల కేటాయింపు**
- **పునరుద్ధరించిన పథకం కింద 30 క్రీడాంశాల్లో 10,000 మంది ఖేలో ఇండియా అథ్లెట్లకూ, 20,000 మంది ఖేలో ఇండియా వర్ధమాన అథ్లెట్లకూ ప్రోత్సాహం**

**హైదరాబాద్ పిఐబి వెలుతురు ఆగస్టు 21:**

పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం భారత క్రీడారంగం రూపురేఖలను మార్చే సామర్థ్యం కలిగి ఉందని రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న (2012 లండన్, 2016 రియో) క్రీడాకారిణి, ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుత్తా అన్నారు. హైదరాబాద్ లో శుక్రవారం రోజున మీడియాతో మాట్లాడుతూ, ఈ పథకం క్రీడారంగంలో పెనుమార్పు తీసుకొచ్చే గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని, చాలా కాలం క్రితమే ఈ పథకం రావాల్సిందని ఆమె పేర్కొన్నారు. జ్వాలా గుత్తాతో పాటు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏటీఎస్) వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనిబాలా దేవి, బెంగళూరులోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ) ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ విష్ణు సుధాకరన్, ఢిల్లీలోని ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి ఎస్. హిమబిందు కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో శ్రీమతి హిమ బిందు మాట్లాడుతూ, ఖేలో ఇండియా పథకంలోని కీలక అంశాలను, తెలంగాణ వంటి రాష్ట్రంపై ఈ పథకం చూపించే ప్రభావాన్ని వివరించారు. 2026–31 కాలానికి అమలయ్యే ఈ పథకానికి గత కేటాయింపుతో పోలిస్తే 8 రెట్లు పెంచి రూ.29,054 కోట్లను కేటాయించారు. ఈ పథకం ద్వారా మద్దతు పొందే క్రీడాకారుల సంఖ్యను 10 రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు."ఈ పథకం కింద క్రీడల్లో అట్టడుగు స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి ప్రతిభకు చేరుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు. వ్యవస్థలోని లోటుపాట్లను ఈ పథకం పరిష్కరిస్తుంది. కోచ్‌లతో బోర్డును ఏర్పాటు ద్వారా చిన్నారుల క్రీడా ప్రతిభను మరింత మెరుగుపరచేందుకు అవకాశం ఉంటుంది. అకాడమీల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, మౌలిక సదుపాయాలు, క్రీడా సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి" అని శ్రీమతి హిమబిందు తెలిపారు.తెలంగాణలో క్రీడల అభివృద్ధికి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో మొత్తం 33 ఖేలో ఇండియా కేంద్రాలను మంజూరు చేశారు. వీటిలో మాజీ ఛాంపియన్ క్రీడాకారులు 601 మందికి పైగా క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు. మేడ్చల్ – మల్కాజ్‌గిరిలో ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇందులో రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో మొత్తం 254 మంది క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం అందుతోంది. వీరిలో 152 మంది పురుషులు, 102 మంది మహిళా క్రీడాకారులు ఉన్నారు. రాష్ట్రంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, టెన్నిస్, ఫుట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో మొత్తం 19 ఖేలో ఇండియా గుర్తింపు పొంది న అకాడమీలను ఏర్పాటు చేసేందుకు నోటిఫై చేశారు. మహిళల కోసం క్రీడల (స్పోర్ట్స్ ఫర్ ఉమెన్) విభాగం కింద తెలంగాణలో 127 అస్మిత లీగ్‌లు నిర్వహించగా, వీటిలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

**గుత్తా ఇలా అన్నారు:**

"నేనూ ప్రభుత్వ అండతోనే ఎదిగాను. ప్రభుత్వ మద్దతు లేకుండా ఒక క్రీడాకారిణిగా నేను సాధించినదంతా సాధ్యమయ్యేది కాదు. కొత్త రూపంలోని ఈ ఖేలో ఇండియా పథకం చాలా ఆశాజనకంగా కనిపిస్తోంది. క్షేత్ర స్థాయి నుంచి అభివృద్ధి, సుస్థిరతపై దృష్టి సారించడంతో, పిల్లలను క్రీడలకు పంపడాన్ని తల్లిదండ్రులు చాలా సురక్షితంగా భావిస్తారు. క్రీడలను ప్రోత్సహించడంపై ప్రభుత్వం ఎల్లప్పుడూ శ్రద్ధ వహిస్తూనే ఉంది. ఇది ఈ రంగంపై గణనీయ ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం కూడా అపారంగా ఉంటుంది. ఈ పథకంతో అనుబంధం



ఉన్నందుకు నేను సంతోషంగా ఉన్నాను" అని అన్నారు. 'ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు', 'ఫీడర్ పాఠశాలలు', 'ఖేలో ఇండియా కేంద్రాల' ద్వారా ఒక ప్రామాణికమైన, శాస్త్రీయమైన, సాంకేతికతతో కూడిన ప్రతిభా గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేయడం కేఐఎస్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఈ విధానం 'ఖేలో ఇండియా అథ్లెట్లు', 'వర్ధమాన ఖేలో ఇండియా అథ్లెట్లు' (ఇ-కేఐఏ) అనే విభాగాలను పరిగణనలోకి తీసుకుంటుంది.కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలకు మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడంపై కేఐఎస్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. ఈ దార్శనికతలో భాగంగా ఈ ఏడాది చివర్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణ నిర్వహించనుంది. ఖేలో ఇండియా స్కీమ్‌లో ప్రతిభను మెరుగుపరచడం, అథ్లెట్ల నిలుపుదల, అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి పరివర్తన, సంస్కరణ–ఆధారిత విజయాల ఆధారంగా నిధులు అందించే నిబంధనతో... కేంద్ర–రాష్ట్రాల సహకార నమూనా సదుపాయం అందుబాటులో ఉంది. "తెలంగాణ వంటి రాష్ట్రానికి ఇది ఎంతో ప్రయోజనకరం. ఈ పథకం దీర్ఘకాలిక ప్రణాళికా రచనకు తోడ్పడుతుంది. క్రీడలను ఒక అంశంగా పరిగణించే రాష్ట్రాల విధానంపై ఈ దార్శనికత గణనీయ ప్రభావం చూపుతుంది. క్రీడలను విద్యా విధానంతో అనుసంధానిస్తున్న క్రమంలో, మనం మరింత మెరుగైన ఫలితాలను ఆశించవచ్చు" అని డాక్టర్ సోనిబాలా దేవి అన్నారు.ఖేలో ఇండియా పథకాన్ని ఇంకా మెరుగుపరుస్తున్నట్లు శ్రీ సుధాకరన్ అన్నారు. "ఈ పథకం ఎలా పనిచేస్తుంది, రాష్ట్రాలు దీనిలోని కీలక అంశాలను ఎలా స్వీకరిస్తాయి అనే విషయాలను కార్యాచరణ మార్గదర్శకాలు వివరిస్తాయి. గతంలో మేం పరిమిత బడ్జెట్లతో 'కేంద్రీకృత' విధానాన్ని అనుసరించేవాళ్లం. ఈ ఖేలో ఇండియా పథకం, భాగస్వాములందరితో జరిపిన విస్తృత చర్చల ఫలితమే. ఇది అందరికీ ప్రయోజనకరం. క్రీడా ఉద్యమాన్ని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'ఖేలో భారత్ నీతి'ని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ కేటాయించారు" అని ఆయన అన్నారు.

# ఎర్రబెల్లి గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతాం





- **రాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటు జరిగితే కొత్తకొండ మండలం ఏర్పాటు చేసి ఎర్రబెల్లి గ్రామాన్ని కొత్తకొండ లో కలుపుతాం**
- **ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం - గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ - మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఎర్రబెల్లి వెలుతురు ఆగస్టు 21:**

హుస్నాబాద్ నియోజకవర్గం వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజా పాలన ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఎర్రబెల్లి గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు ప్రజా ప్రభుత్వంలో ఎర్రబెల్లి గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.**

- **గ్రామంలో 1,508 రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.**
- **468 పెన్షన్లు అమలులో ఉన్నాయి.**
- **రైతు భరోసా కింద 1,075 మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.**
- **రైతు బీమా కింద ఇప్పటివరకు 23 మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరగా, ముగ్గురు రైతు కుటుంబాలకు రూ.15 లక్షలు విడుదల చేశారు.**
- **66 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద నిధులు విడుదల చేశారు.**
- **147 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు.**
- **24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి.**
- **716 కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.**
- **612 కుటుంబాలకు మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ అందుతోంది.**
- **భూ భారతి కింద నమోదైన 26 కేసుల్లో 12 కేసులు పరిష్కరించారు.**
- **ఆయిల్‌పామ్ సాగు కింద 20 మంది లబ్ధిదారులు ఉన్నారు.**
- **గ్రామంలో వివిధ కార్యక్రమాల కోసం స్టీల్ బ్యాంక్ వినియోగిస్తున్నారు.**
- **అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.**

**పల్లె దవాఖాన కోసం స్థలం విరాళం**

- **ఎర్రబెల్లి గ్రామంలో పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని సర్పంచ్ శ్రవణ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఇందుకోసం తన తండ్రి జ్ఞాపకార్థం 3 గుంటల స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు సర్పంచ్ ప్రకటించారు.**
- **గ్రామంలో సంపు నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించారు.**
- **అంతర్గత రహదారుల నిర్మాణం, అంబేద్కర్ విగ్రహం నుంచి తండాకు వెళ్లే రహదారి పూర్తి చేయడం వంటి సమస్యలను సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే మంత్రి మంజూరు చేసిన రూ.10 లక్షలతో వీఓ భవనం నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించాలని మంత్రి సూచించారు.**
- **ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం**
- **గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును మరింత పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు.**
- **ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.**
- **ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించాలి**
- **జలసిరి పథకం కింద ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 వరకు సహాయం అందిస్తుందని తెలిపారు.**
- **అదేవిధంగా పంట పొలాల్లో ఫామ్ పాండ్ నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తుందని చెప్పారు.**
- **గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి కాలువల ద్వారా నీరు**
- **గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కాలువల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.**
- **ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి**
- **ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మంత్రి కోరారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.**
- **ఈ నెల 31 వరకు పెన్షన్ దరఖాస్తులకు అవకాశం**
- **అర్హులైన వారు కొత్త పెన్షన్ల కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ తదితర అర్హులైన వారికి సంబంధించిన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.**
- **నెల రోజుల్లో నరహరి తండా - ఎర్రబెల్లి రోడ్డు పూర్తి**
- **నరహరి తండా నుంచి ఎర్రబెల్లి వరకు పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను నెల రోజుల్లో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.**
- **గ్రామ అవసరాల కోసం, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మట్టిని వినియోగించుకుంటే ఎవరూ అడ్డుకోవద్దని అధికారులను ఆదేశించారు.**
- **కొత్తకొండ మండలం ఏర్పాటు కోసం కృషి చేస్తా**
- **రాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటు సమయంలో కొత్తకొండ మండలం ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తకొండ మండలం ఏర్పాటైనప్పుడు ఎర్రబెల్లి గ్రామాన్ని అందులో చేర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.**
- **పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాల ఏర్పాటు ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.**
- **సోలార్ విద్యుత్‌తో అదనపు ఆదాయం**
- **పీఎం సోలార్ ఘర్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు.**
- **గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రవణ్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.**



# 23 ఏళ్లుగా పూర్తికాని ధర్మారెడ్డిపల్లి కాలువను పూర్తి చేసి సాగునీరు అందించాలి

- సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 21:**

గ్రామం కొమ్మాయిగూడెం ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి. గుంతలమయమైన ఆర్ఎంబీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.అర్హులైన పేదలందరికీ పింఛన్లు మంజూరు చేయాలి.కొమ్మాయిగూడెం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి జల్లెల పెంటయ్య మాట్లాడుతూ, ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణం ప్రారంభమై 23 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. కాలువను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని భూములు పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలువ పూర్తయితే ఈ ప్రాంతంలోని అనేక మంది రైతులకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని వెంటనే బడ్జెట్ కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రామన్నపేట–కొమ్మాయిగూడెం మీదుగా పెద్దకాపర్తి వరకు ఆర్ఎంబీ రోడ్డు అనేక సంవత్సరాలుగా గుంతలమయంగా మారి కాళ్లు చేతులు విరిగి ప్రాణాలు పోయినా అధికారులు ప్రభుత్వం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు అధ్వాన్న స్థితిగా ఉన్న రోడ్డును వెంటనే నూతనంగా ఏర్పాటు చేయాలని అన్నారు.గ్రామంలో అనేక మంది అర్హులైన పేదలు ఉన్నప్పటికీ సంవత్సరాలు దాటుతున్ననేటికీ పింఛన్లు అందడం లేదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం, పింఛన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. కొమ్మాయిగూడెం నుండి వెలిమినేడు. సిరిపురం గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ పార్టీ మండల నాయకులు కూరెల్ల నరసింహాచారి కందుల హనుమంతు కల్లూరు నాగేష్ భావనపల్లి బాలరాజ్ ఆవనగంటి నాగేష్ మేడి ముకుందం మునుకుంట్ల లేని పల్లె సత్యం దీక్షలో కూర్చున్న నాయకులు శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు ఎర్ర రవీందర్ ఎర్ర కాటమయ్య అంతటి సత్తయ్య అంతటి నరసింహ శానగొండ రాము సాగర్ల శేఖర్ గుణగంటి మల్లేష్ జల్లెల మల్లేశం ఆకిటి మల్లేశం ఆకిటి శ్రీను కడప చరణ్ బాణాల నవీన్ రెడ్డి గోలి ఉత్తేజ్ కొండగడప నవీన్ జల్లెల శివకుమార్ బోయపల్లి శంకర్ పొట్లచెరువు శంకరయ్య మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ ఎర్ర సుమలత ఎర్ర అలివేలు బాత్క ఐలమ్మ బాత్క మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# జన్వాడలో గంజాయి విక్రయిస్తున్న ఒడిశా వ్యక్తి అరెస్ట్

- 2 కిలోల 80 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం



**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 21 :**

మండల పరిధిలోని జన్వాడ గేటు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఒడిశాకు చెందిన ఒక వ్యక్తిని మొకిలా పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 2 కిలోల 80 గ్రాముల పొడి గంజాయి, ఒక బైక్, మరియు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## పోలీసుల తనిఖీల్లో గుట్టురట్టు

పోలీసుల కథనం ప్రకారం.. మోకిలా పోలీసులకు అందిన నమ్మకమైన సమాచారంతో జన్వాడ గేటు పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 29 బిఎక్స్ 3751 నంబర్ గల స్ప్లెండర్ ప్లస్ బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న జగన్నాథ్ మండల్ (42) అనే వ్యక్తిని ఆపి సోదా చేశారు.

## కూలీలకు విక్రయించేందుకు ప్లాన్

అతని వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను పరిశీలించగా, రెండు పార్సిళ్లలో ప్యాక్ చేసి ఉన్న మొత్తం 2 కిలోల 80 గ్రాముల డ్రై గంజాయి లభ్యమైంది. నిందితుడు ఈ గంజాయిని ఒడిశా ప్రాంతం నుండి తీసుకువచ్చినట్లు విచారణలో అంగీకరించాడు. జన్వాడ పరిసర ప్రాంతాల్లోని నిర్మాణ రంగ కూలీలకు దీనిని అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధమైనట్లు పోలీసులు గుర్తించారు.



## రిమాండ్‌కు నిందితుడు

గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన బైక్, హ్యాండ్ బ్యాగ్ మరియు నిందితుడి మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు మొకిలా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు అతనికి రిమాండ్ విధించింది. ఈ కేసుపై పోలీసులు తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశారు.



# రామన్నపేట న్యాయ పరిధిలో తేదీ. 12-09-2026న జాతీయ లోక్ అదాలత్

- "రాజీ ద్వారా పరిష్కారం—సత్వర న్యాయం"

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 21:**

ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని తేదీ. 12-09-2026న రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలో నిర్వహించనున్నట్లు సంబంధిత న్యాయాధికారులు తెలిపారు. జి. సబితా సీనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమ్యూనిటీ రామన్నపేట తెలిపారు. మాట్లాడుతూ, రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలోని కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ చేసుకునే అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్ మరియు ఆర్థిక వివాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు తదితర కేసులను ఇరుపక్షాల సమ్మతితో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు, వివాదాలకు స్నేహపూర్వకంగా , త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కోర్టులలో పెండిం గ్‌లో ఉన్న కేసులతో పాటు, లోక్ అదాలత్ పరిధిలో పరిష్కరించదగిన వివాదాలను కూడా సంబం ధిత న్యాయ వాదుల సహకారంతో ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవచ్చన్నారు. కావున రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలోని కక్షిదారులు, న్యాయవాదులు ప్రజలు తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునేందుకు తేదీ. 12-09-2026 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారులు కోరారు.



# హద్నూర్ పీఎస్, జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వార్షిక తనిఖీలు

- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ....
- ఎస్పీ పరితోష్ పంకజ్....



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ శుక్రవారం హద్నూర్ పోలీస్ స్టేషన్, జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. హద్నూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, డీఎస్పీ సైదా నాయక్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, వివిధ రికార్డుల నిర్వహణను పరిశీలించారు.స్టేషన్‌లోని పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబంధించిన ఆస్తులు, స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టులో సమర్పించే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా పరిగణించి, పగలు, రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి:

సీసీటీఎన్ఎస్–2.0, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, సీఈఐఆర్, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైస్ వంటి సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి స్థాయిలో పట్టు సాధించాలని ఎస్పీ సూచించారు. స్టేషన్ రికార్డుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్–2.0లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు:

అనంతరం జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారం, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలు ఉంటే ఎన్‌హెచ్ఏ అధికారులతో సమన్వయం చేసుకుని మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండటంతో అక్రమ రవాణాకు అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ ఆదేశించారు. నాకాబందీ నిర్వహిస్తూ అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.హద్నూర్ పోలీస్ స్టేషన్, జహీరా బాద్ డీఎస్పీ కార్యాలయ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఎస్పీ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. సిబ్బంది సంక్షేమానికి ఎస్‌హెచ్ఓ సుజిత్ తీసుకుంటున్న చర్యలను ఎస్పీ అభినందించారు.వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, రూరల్ సీఐ హనుమంతు, టౌన్ సీఐ రవి, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# నగునూరు జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా విద్యార్థులకు మోటివేషన్ తరగతులు, పుస్తకాలు, బ్యాగుల పంపిణీ


- విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన అప్పాల ప్రసాద్ జి...

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 21:**

కరీంనగర్ గ్రామీణ మండలం పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ నగునూరు పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సమరసత వేదిక ప్రాంత ప్రముఖ్ ఆదరణీయ అప్పాల ప్రసాద్ జీ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలపై చక్కటి మార్గదర్శనం చేశారు.ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూల్ బ్యాగులు మరియు రాత పుస్తకాలను (నోట్బుక్స్) అం దజేశారు.కార్యక్రమంలోనగునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు లు, తపస్ జిల్లా అధ్యక్షులుఅన్నమనేని తిరుపతిరావు సామాజిక సమరసత వేదిక రాష్ట్ర సహ ప్రముఖ్ పి. రామారావు సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేష్ రెడ్డి దావు సంతోష్ , పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఘనంగా కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



- హాజరైన శంకర్పల్లి కాంగ్రెస్ ముఖ్య నాయకులు
- ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 21 :**


చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు, మొయినాబాద్ మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంకర్పల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, శంకర్పల్లి మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం వెంకటరెడ్డి, డిసిసి వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలే శ్రీకాంత్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో శంకర్పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మైనారిటీ నాయకులు, అలాగే శంకర్పల్లి మున్సిపల్ మరియు మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు అందజేశారు.

# గెస్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 21 :**

మెదక్ జిల్లా :– నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌడిపల్లి మండలంలోని తునికి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాములు, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ మహా త్మ జ్యోతిబాపూలే స్కూల్లో గెస్ట్ టీచర్లు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల క్యాంపస్ లో ఉంటూ హౌస్ మాస్టర్ గా, నైట్ కేర్ టీచర్ గా, హాలిడే డ్యూటీ లు చేస్తూ, వివిధ రకాల ఇన్చార్జిలుగా ఉంటూ 24 గంటలు స్టూడెంట్స్ కు, స్కూల్ క్యాంపస్ కు అందు బాటులో ఉంటూ వారి బంగారు భవిష్యత్తుకు నిరంత రం కృషి చేస్తున్నారన్నారు.అందువల్ల గెస్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం,ఏడాదిలో 12 నెలల వేతనం, నెలకు రూ.36 వేల జీతం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు సానుకూ లంగా స్పందించిన తీన్మార్ మల్లన్న మండలిలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మహేష్, భూమయ్య, సురేష్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.



## బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలి

- రామన్నపేట కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన
- ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 21:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుసరిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఏ ఐ ఎల్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. రామన్నపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుత , మనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం అభ్యంతరకరమన్నారు. బీసీఐ ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం, వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని పేర్కొన్నారు. బీసీఐ అధికారిక పదవిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు.నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం ఏకపక్షమైన,చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా అభిప్రాయం వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం–1961కు విరుద్ధమన్నారు. ఆదేశాలను అనంతరం ఉపసంహరించుకున్నప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించుకోలేరన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికార స్థానాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీసీఐ కోల్పోయిన గౌరవం, విశ్వసనీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ, వీరమల్ల నర్సింహ, అంతటి రమేష్, అంకం నరేష్ బాలరాజు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్ సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పిల్ల బుచ్చయ్యను ఘనంగా సన్మానించిన బిజెపి నాయకులు



**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 21:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులు లింగోజిగూడెం మాజీ ఉపసర్పంచ్ పిల్ల బుచ్చయ్య గారిని ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా వారిని ఈరోజు చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కదారి కల్పనా యాదవ్ ఘనంగా సన్మానిం చారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగోజి గూడెం గ్రామానికి ప్రజలకు సేవలు చేసిన సందర్భంగా పార్టీ గుర్తించి వారికి ఈ బాధ్యత అప్పజెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు సీనియర్ నాయకులు రమణగొని శంకరయ్య మాట్లాడుతూ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించబడిన పిల్ల బుచ్చయ్య గారు పార్టీకి మరియు ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని కొనియాడారు ఈ సందర్భంగా పిల్ల బుచ్చయ్య మాట్లాడుతూ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి గారికిజిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ గారికి ధన్యవాదాలు తెలిపారు గారికిఈ యొక్క కార్యక్రమంలో రెండవ వార్డ్ కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య బూత్ అధ్యక్షులు బాతురాజు ప్రవీణ్ సీనియర్ నాయకులు పర్నే అంజిరెడ్డి రమణ గోని నరసింహ తూర్పునూరి నరసింహ ఊదరి రంగయ్య ఎర్రగోని మల్లేశం పోలపల్లి భాస్కర్ ఎర్ర నరసింహ పిల్ల యాదయ్య పిల్ల శ్రీకాంత్ పిల్ల సురేష్ పిల్ల శ్రీధర్ పిల్ల కోయిల గూడెం రవిచంద్ర శ్రీశైలం గుండపల్లి వెంకట రెడ్డి రమేష్ శివశంకర్ రమేష్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



**మునుగోడు, ఆగస్ట్21(వెలుతురు):** మండల కేంద్రంలోని కనకదుర్గాదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి వ్రత పూజలు చేపట్టారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు శ్రావణి, నాగరాజుగౌడ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు పందుల నీతా రాజేష్, మాదగోని నరేందర్‌గౌడ్, చొల్లేటి బిక్షమాచారి, శ్రీరామోజు వెంకటేశ్వర్లు, పందుల లింగస్వామి, పోలే వెంకటేశ్వర్లు, పందుల అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోదాసు నాగరాజు యాదయ్య మృతి చాలా బాధాకరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 21:** గ్రామం ఇంద్రపాలనగరం బోదాసునాగరాజు యాదయ్య అనారోగ్యం తో మరణించగా మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేసిన తెలంగాణా రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం జేఏసీ కార్యదర్శి సర్పంచ్ గర్దాస్ విక్రమ్ వార్డ్ సభ్యులు వరికుప్పలస్వామి, రేపాక పారిజాత యాదయ్య, పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, మంటి లింగస్వామి,రాస వెంకటేష్,మందడి శ్రీధర్ రెడ్డి,మాజీ ఏఎంసీ డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, పాలసంఘము డైరెక్టర్ రాజన్నగారి అలివేలు మురళి, జిట్టబోయిన వెంకటేష్, సింగణబోయిన మల్లేశం, గోళ్లేపల్లి యాదయ్య, కాటేపల్లి యాదయ్య, మేకల నరేందర్, పగుడాల వెంకటేష్, మాధం నాగేష్, భువనగిరి మధు, గర్ధాస్ సాయి, గర్ధాస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత ఉన్నచోట ధనలక్ష్మి ఉంటుంది





**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 21:** ఆధ్యాత్మికత ఉన్న ఇంటికి ధనలక్ష్మి ఘల్లుఘల్లున శబ్దం చేసుకుంటూ వస్తుందని బ్రహ్మకుమారి స్వర్ణలత తెలిపారు. చౌటుప్పల్ బీసీ కాలనీ 14 వార్డ్ లోని రాజయోగ ధ్యాన కేంద్రంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. చుట్టుపక్కల ఉన్న మహిళలకు పసుపు, కుంకుమ, తాంబూలం ఇచ్చి సత్కరించి వరలక్ష్మి వ్రతం యొక్క మహత్యాన్ని అర్థం చేయించారు. మహిళల చేతికి భగవంతుని కంకణం కట్టారు. లడ్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వరలక్ష్మీ వ్రత ఆచరణ చేయాలి అంటే మన ఇంటిని ఆధ్యాత్మికత తో నింపాలని, ప్రతి ఒక్కరూ త్రికరణశుద్ధిగా పంచ తత్వాలను ఆరాధించాలని, ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి జీవించినప్పుడే మన ఇంటికి ధనలక్ష్మి ఘల్లు ఘల్లున వస్తుంది అని వివరించారు.ఇందులో పాల్గొన్న వాళ్లు మంగమ్మ మౌనిక సువర్ణ అక్షిత పద్మ త్రివేణి సునీత మమత వీరా శివాని నిహారిక ఆధ్యాత్మికత ఎక్కడుంటుందో అక్కడ లక్ష్మీదేవి నివాసం ఉంటుందని అర్థం చేయడం జరిగింది

## మిత్రుని కోసం ఆపదలో అండగా నిలిచే మనసున్న స్నేహితులు



**గుండాల ఆగస్టు 21.(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న సీతారాంపురం 1994–95 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడం మాత్రమే కాదు... ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో తోడుగా ఉండడం. ఈ మాటను సీతారాంపురం 1994–95 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు తమ సేవా కార్యక్రమాల ద్వారా మరోసారి నిరూపించారు.తమ క్లాస్‌మేట్ ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు "మేమున్నాం... మీకు అండగా ఉంటాం" అంటూ ముందుకు వస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ తమ స్నేహబంధాన్ని చాటుకుంటున్నారు. ఇటీవల అనారోగ్య కారణంగా మన ప్రియ మిత్రుడు సీతారాంపురం రామ్రెడ్డి గారు అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో 1994–95 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులందరూ కలిసి ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహాయాన్ని అందించిన గుండు శ్రీనివాస్, అనంతుల చంద్రశేఖర్, బూడిద ఉప్పలయ్య, కాళీ వెంకన్న, సీతాల మల్లేశం, డాక్టర్ చారి గార్లతో పాటు సహకరించిన మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో మన స్నేహబంధం మరింత బలపడాలని, ఆపదలో ఉన్న ప్రతి మిత్రుడికి మనమందరం అండగా నిలవాలని కోరుకుందాం.

## పచ్చదనంతో మానసిక ప్రశాంతత

- ఆస్పత్రి సూపరింటెంట్ డా. వెంకటేశ్వర్లు



**రామన్నపేట వెలుతురుఆగస్టు 21:** పచ్చదనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆయన వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి. దీంతో దుమ్ము, కాలుష్యం తగ్గుతుంది. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రశాంతమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి అందించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. సిబ్బంది కూడా తమ బాధ్యతగా నాటిన ప్రతి మొక్కను పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. సదాఫ్ ఫాతిమా, డా. లావణ్య, డా. జైనబ్ సుల్తానా, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల ఆనంద్, హెడ్ నర్స్ సోలి, సిబ్బంది సాయి తేజ, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలకు ఆర్టిఐ జరిమాన



**నల్లగొండ వెలుతురు ఆగస్టు 21, :** జల్లెల గోవర్ధన్ యాదవ్, రాష్ట్రీయ శ్రీరాంసేన, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు ఉమ్మడి నల్గొండ జిల్లా మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రాంతీయ సంయుక్త అధికారి కార్యాలయం నల్గొండ ఆధ్వర్యంలో ఉన్న గురుకుల పాఠశాలలు & కళాశాలలకు సంబంధించిన సమాచారము తేదీ 31-10-2025 న ఆర్.టి.ఐ ద్వారా సెక్షన్ 4(1)(B) సమాచారంతో పాటు గురుకుల పాఠశాలల, కళాశాలలలో జరుగుతున్న కార్యక్రమాలు, విద్యార్థులకు అందిస్తున్న నిత్యవసరాలతో పాటు మిల్స్ మెనూ కు సంబంధించిన విషయాలపై సమాచారం కోరగా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారులు దరఖాస్తు దారున్ని తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు సమాచారం, అసంతృప్తి సమాచారం ఇచ్చారు. సమాచార హక్కు చట్టాన్ని అధికారులు నిర్లక్ష్యం, నిర్వీర్యం చేస్తూ, ఇష్టానుసారంగా వ్యవహరించినందుకు, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ కి తేదీ:17-01-2026న, అప్పీల్ కు వెళ్లగా తేదీ: 15-07-2026న, విచారణ జరిపించి 8 గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్ లకు జరిమానా విధించారు. అవి 1.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల& కళాశాల నాగార్జునసాగర్, 2.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల బొప్పారం, కేతపల్లి మండలం, 3.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల కనగల్, నల్గొండ, 4.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల అవంతిపురం, మిర్యాలగూడ, 5. మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల కొండమల్లేపల్లి, దేవరకొండ, 6.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నాగార్జున సాగర్ పెద్దవూర, 7.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల కొలిముంతలపాడు, కొండ భీమన పల్లి, దేవరకొండ, 8.మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల వలిగొండ యాదాద్రి భువనగిరి జిల్లా పాఠశాలలు, కళాశాలలకు, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ తేదీ 15-07-2026 న జరిపిన విచారణలో భాగంగా ఆర్టిఐ రాష్ట్ర కమిషనర్ మోసిన పర్వీన్, విచారణ జరిపి 1000/-రూపాయలు జరిమానా విధించారు. జరిమానా 14 రోజులల్లో చెల్లించని ఎడల 25000/- చెల్లించాలని ఆదేశించారు. ఆర్టిఐ యు/ఎస్- 7(6) ప్రకారంగా దరఖాస్తు దారుడు కోరిన పూర్తి సమాచారం రెండు వారాలలోగా ఉచితంగా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ పూర్తి సమాచారం ఇవ్వని ఎడల కమిషనర్ ఆదేశాలను అమలు చేయక పోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం హైదరాబాద్ కార్యాలయం నుండి రిజిస్టర్ పోస్టు ద్వారా తేదీ 19-08-2026 న, కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్టుగా లేఖ పంపడం జరిగింది. దరఖాస్తుదారుడు జల్లెల గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రతి పౌరుడు తన యొక్క హక్కులని ఉపయోగించు కోవాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడే వారికి ఆర్టిఐ చట్టం సింహస్వప్నంగా మారిందని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కి ధన్యవాదాలు తెలియజేసినారు.

## స్మార్ట్ మీటర్లతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి



**మోత్కూర్, ఆగష్టు 21,వెలుతురు :** పదవులమీదమోజుతో తెలంగాణప్రజలను బలి చేస్తు స్మార్ట్ మీటర్ల నేపంతో ఉచితకరెంటును ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే తెలంగాణలో కెసిఆర్ ప్రవేశపెట్టిన రైతుబంద్, రైతుబీమా, కల్యాణలక్ష్మి ,కెసిఆర్ కిట్టు లాంటి పథకాలను బంధు చేసి ఇప్పుడు స్మార్ట్ మీటర్ల వంకతో తెలంగాణ రాష్ట్రంలో ఉచిత కరెంట్ ను కూడా బంద్ చేసే ఉద్దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని వాపోయారు. రైతు ప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రశ్నించారు.ఉన్నపథకాలను తీసివేస్తూ రైతులను ఇబ్బంది పెడ్తానంటే ఊరుకోమని ప్రాణాలు పోయినా సరే తెలంగాణాలో స్మార్ట్ మీటర్లు పెట్టనియ్యను అన్న కెసిఆర్ నాయకత్వంలో ఉద్యమం చేయడానికి తెలంగాణ ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు.

## ప్రిన్సిపాల్ ను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- బి.ఆర్.ఎస్.ఎస్ డిమాండ్



**మోత్కూరు, ఆగస్టు 21, వెలుతురు :** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డిని అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థులు వ్యసనాలను బారిన పడి ఘాతుకాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. చిన్నతనం నుంచే తమ పిల్లలను తల్లిదండ్రులు వారిని పెంచే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఇన్‌స్ట్రామ్ యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు మారిన, సామాజిక పరిస్థితులు విద్యార్థులు, మైనర్లపై నేర పరమైన ప్రవృత్తికి కారణమవుతున్నాయని, వాటిని కేంద్ర ప్రభుత్వం తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. చట్టాలను సవరించి ఇలాంటి ఘటనలు భవిష్యత్ లో జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోబీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, స్థానిక నాయకులు బొడ్డుపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

# కలశ్ వందన్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు
- జగిత్యాల జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్

**జగిత్యాల వెలుతురు ఆగస్టు 21:**
సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సమరసత సంకల్ప్ అభియాన్'లో భాగంగా చేపట్టనున్న 'కలశ్ వందన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో 'కలశ్ వందన్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, కుల, వర్గ భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. రవిదాస్ మహారాజ్ చూపిన సమరసత మార్గాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.నారపాక అశోక్ మాట్లాడుతూ కాశీలోని సంత్ రవిదాస్ మహారాజ్ జన్మస్థల పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన పవిత్ర కలశాలను దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపించినట్లు తెలిపారు. తెలంగాణకు చేరిన పవిత్ర కలశాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి, ప్రతి ప్రాంతానికి సంత్ రవిదాస్ మహారాజ్ సందేశాన్ని చేరవేసేలా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ నెల 23న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణలోని 33 జిల్లాలకు పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు, పార్టీ పదాధికారులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి 'కలశ్ వందన్ అభియాన్'ను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, సమరసత సంకల్ప్ అభియాన్ జిల్లా కో-కన్వీనర్ సింగం పద్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్రిపల్లి సత్యం, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, సీనియర్ నాయకులు కస్తూరి సత్యం, ఎస్సీ మోర్చా నాయకులు నక్క జీవన్, ఎర్ర రాజు, తడగొండ అంజయ్య, కొత్తూరు బాబు, దుర్గం రమేష్, కొత్తూరు అంజి, అంకమల్ల అనిల్, బెత్తెపు నరసయ్య పాల్గొన్నారు.



# 2వ, 12వ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 21:**
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచుతూ 2వ, 12వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.నగరపాలక సంస్థ 2వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న CC రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం 12వ డివిజన్ విఘ్నేశ్వర కాలనీలో UIDF నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధితో కాలనీవాసులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేయర్ పేర్కొన్నారు.నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు గారు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# అంత్యక్రియల్లో పాల్గొన్న పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 21 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గపూర్ మండల పరిధిలోని కద్పల్ గ్రామానికి లక్ష్మణ్ ఎస్సై గారి సతీమణి అనారోగ్యంతో మరణించగా వారి అంత్య క్రియల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వారితో పాటు నారాయణ రెడ్డి ప్రతాప్ రెడ్డి సొసైటీ చైర్మన్,యాదవ రెడ్డి మాజీ సర్పంచ్,బాల్రామ్, ముంతాజ్ సెట్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# విద్యార్థుల కనీస అవసరాల తీర్చేందుకు మెగా యూత్ అసోసియేషన్ కృషి



- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ.

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కనీస అవసరాలను తీర్చేందుకు మెగా యూత్ అసోసియేషన్, మెగా ఫ్యాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ అసోసియేషన్ కన్వీనర్ దంగే సత్యనారాయణ తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భాగారెడ్డిపల్లి కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల నంబర్-5లో విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దంగే సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. చిరంజీవి జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల నంబర్-5లో సుమారు 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువులో అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి కొంతమేర సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులు, పేద కుటుంబాలు, అవసరమైన వారికి తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కార్యక్రమ నిర్వాహకులను శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ డి. సత్యనారాయణ, బెజవాడ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు రత్నయ్య, సంగారెడ్డి, విశ్వనాథ్, సీనియర్ అభిమాని అర్సిపురం, తుక్కారెడ్డి, ఈ. విట్టల్ గౌడ్, విజయ్ స్వామి, విజయ్ కుమార్, యాదవ్ రెడ్డి, శంకర్, ప్రవీణ్, బి. విట్టల్,, పి. శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

# జీవో 97పై జహీరాబాద్‌లో విద్యార్థుల ఆందోళన

- ఐదు కిలోమీటర్లు సాగిన విద్యార్థుల ర్యాలీ...
- డిప్లొమా విద్య ప్రాధాన్యతను కాపాడాలి: పీడీఎస్‌యూ...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**
స్కిల్ యూనివర్సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు ఉన్న ప్రత్యేకతను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్‌లో భారీ ఆందోళన చేపట్టారు. రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర 1500 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి ఈ. గోపాల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీం, జీవో నంబర్ 97 కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన అనంతరం ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు తాజా నిర్ణయాలు ఇబ్బందులు కలిగిస్తాయని అన్నారు.డిప్లొమా కోర్సులను ఐటీఐలు, ఏటీసీలతో అనుసంధానం చేయడం వల్ల డిప్లొమా విద్యకు ఉన్న ప్రత్యేకత, ప్రాధాన్యత దెబ్బతింటుందని వారు పేర్కొన్నారు. సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, డిప్లొమా విద్యను సాధారణ నైపుణ్య శిక్షణ స్థాయికి పరిమితం చేసేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. దీని వల్ల విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (SBTET) స్వతంత్రతను దెబ్బతీసే విధంగా జీవో నంబర్ 97 ఉందని




పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక గుర్తింపు, సాంకేతిక విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలను ప్రభుత్వం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు.

- పీడీఎస్‌యూ ప్రధాన డిమాండ్లు:
- జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలి.
- పాలిటెక్నిక్ డిప్లొమా విద్య ప్రాధాన్యత, ప్రత్యేకతను కాపాడాలి.
- డిప్లొమా కోర్సులను ఐటీఐలు, ఏటీసీలతో అనుసంధానం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
- SBTET స్వతంత్రతను పరిరక్షించాలి.
- డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించే అవకాశాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలి.
- విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలపై విద్యార్థి సంఘాలు, సాంకేతిక విద్యా నిపుణులతో ప్రభుత్వం చర్చించాలి.

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడవద్దని, తక్షణమే జీవో 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులను ఐక్యం చేసి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు క్రాంతికుమార్, సలావుద్దీన్, సునీల్, కరణ్, ప్రసాద్, నీలావతి, మా లక్ష్మి , అపర్ణ, సరిత, శైలు, జశ్వంత్, వివేకానంద్, తులసిరాం, కార్తీక్, అఖిల, శ్రీలత, బిందుప్రియ తదితరులు పాల్గొన్నారు.



# 22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి..

- తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలి.
- బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 21:**
తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 22ఏ (నిషేధిత భూములు) జాబితా అక్రమాలు, అవకతవకలపై, వేలాది మంది రైతులు, భూయజమానుల ఆస్తి హక్కులను కాలరాస్తున్న ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకొని, ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రోజున కలెక్టర్ కార్యాలయం లో బిజెపి శ్రేణులతో కలిసి ఉన్నత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ .. 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన భారీ అవకతవకలను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా, ఒక వ్యవస్థీకృత కుట్రగా పరిగణించి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ భారీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మంత్రి పొంగులేటి కుటుంబ కంపెనీకి, ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి వేల కోట్ల విలువైన ప్రాపర్టీస్ బదిలీ అయిన ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తెలిపారు..ధరణి/భూభారతి పోర్టల్స్‌లో గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. కరీంనగర్ జిల్లాలోని 22ఏ భూముల వివరాలను మండలం, గ్రామం, సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు, పట్టా భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు, మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ద్వారా బీజేపీ లేవనెత్తిన డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని , సమస్య పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టకపోతే రైతుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని సాయిని మల్లేశం ఈ సందర్భంగా హెచ్చరించారు.. ఈ



కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, రంగు భాస్కరాచారి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మోతే గంగారెడ్డి, కార్పొరేటర్ ఏ .పి.పి. చంద్ర, ఎన్నం ప్రకాష్ , సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, నాంపల్లి శ్రీనివాస్, అడిచర్ల రాజు, ముత్యాల జగన్ రెడ్డి, గుంజేటి శివ, జగదీశ్వరాచారి, వాసు, సుధాకర్ పటేల్ , కార్పొరేటర్ కె. పి. చంద్ర, ఎన్నం ప్రకాష్ , మండల, జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, అవదుర్తి శ్రీనివాస్, కుంట తిరుపతి, కంది రాజిరెడ్డి, చింతం శ్రీనివాస్, మడి షెట్టి సంతోష్ కచకాయల రాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 21 :**
మెదక్ జిల్లా :- టేక్మల్ మండలం కోరంపల్లి గ్రామ ఆప్తులు నారాయణఖేడ్ మండల గిర్ధవర్ ఆర్ఐ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ మాధవ్ రెడ్డి గారి కుమార్తె యొక్క వివాహ వేడుకలు సంగారెడ్డి పట్టణంలోని జె ఎస్ ఆర్ గార్డెన్ వేదికగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి




శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే గారితో పాటు రమేష్ చౌహాన్, మధుసూదన్ రెడ్డి పి ఆర్ డి ఈ, చందర్ నాయక్ సర్పంచ్, శంకర్ నాయక్, శ్రీను,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోతిరాంపూర్ లో ఘనంగా తీజ్ ఉత్సవాలు

- తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 21:**
కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్ ప్రాంతంలో బంజారా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పాల్గొని బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తీజ్ ఉత్సవాలు మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు దోహదపడతాయన్నారు.





ఉత్సవా ల్లో బంజారా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర,బండ రమణారెడ్డి ,తోట అనిల్ ,గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కర్ర పద్మ అనిల్, దేవసాని సరస్వతి సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి కి నివాళి అర్పించిన ట్రపస

- **పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి : ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి**




**మేడ్చల్ జిల్లా వెలుతురు ఆగస్టు 21:**

విద్యార్థుల చేతుల్లో దారుణ హత్యకు గురైన రూపారెడ్డి కి తెలంగాణ గుర్తింపు పొందిన ఆఫర్డబుల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రపస) గ్రేటర్ కుత్బుల్లాపూర్ కమిటీ ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం సాయంత్రం కుత్బుల్లాపూర్ రంగారెడ్డి నగర్ లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి కోవొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ విధంగా తెగపడటం దారుణమన్నారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు అనుచితంగా ప్రవర్తించడం తరచుగా అక్కడక్కడ వెలుగు చూస్తూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పట్ల తల్లిదండ్రులకు నియంత్రణ లేకపోవడం వాళ్లే ఇలాంటి సంఘటనలకు దారి తీస్తుందని వారు వాపోయారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు లాంటి వాటిపై పాఠశాల ఆవరణలో తరచుగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు కూడా అంతే బాధ్యతాయుతంగా పిల్లల పట్ల వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలు చెడు మార్గంలో వెళితే మందలించే హక్కు ఉపాధ్యాయుడికి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కానీ నేటి సమాజంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడమే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడానికి ఆస్కారం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయుడు ఏమాత్రం మందలించిన, దండించినా తల్లిదండ్రులు వెంటనే ఉపాధ్యాయుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన సంఘట నలు కోకొల్లలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పట్ల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాలు పేరుతో ఉపాధ్యాయుల పట్ల అమానుషంగా వ్యవహరించడతోనే పిల్లలకు ఉపాధ్యాయుడు అంటే గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఉపాధ్యాయునికి గౌరవం పెరిగినప్పుడే ఉత్తమమైన పౌరులుగా పిల్లలు ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరు ఉపాధ్యాయుల స్థాయిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బీర్రు ఆంజనేయులు, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, నర్సింహులు, సి హెచ్ నర్సింహా గౌడ్, వీరన్న, మండల సంఘం నాయకులు కోలా వెంకటేష్, వినోద్ జాదవ్, దయాకర్ జనార్ధన్, శ్రీశైలం, శ్యామ్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 27-08-2026న ఇందిరా పార్క్ వద్ద TGEJAC ధర్నా

**బషీర్ బాగ్ వెలుతురు 21 ఆగస్టు :**

సిటీ పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం TGEJAC రాష్ట్ర బాడీ పిలుపు మేరకు 27-08-2026న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు TGEJAC హైదరాబాద్ సిటీ బాడీ ప్రకటించింది. ఈ సందర్భంగా ఈరోజు జరిగిన TGEJAC హైదరాబాద్ సిటీ బాడీ సమావేశంలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణపై చర్చించారు.

**ప్రధాన డిమాండ్లు:**

- 2వ PRCని వెంటనే అమలు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న 6 విడతల DA & DRను వెంటనే విడుదల చేయాలి.
- CPSను రద్దు చేసి OPSను పునరుద్ధరించాలి.
- పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.
- నూతన EHSను సమర్థవంతంగా అమలు చేయాలి. HOD ఉద్యోగులకు సెక్రటేరియట్‌లో 12.5% కోటాను వెంటనే అమలు చేయాలి.
- హైదరాబాద్ సిటీ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు 27-08-2026న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై,




మన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని TGEJAC హైదరాబాద్ సిటీ బాడీ పిలుపునిచ్చింది.

- మన హక్కుల కోసం — మన డిమాండ్ల సాధన కోసం — ఐక్యంగా పోరాడుదాం, కటుకూరి శ్రీకాంత్ చైర్మన్
- గండూరి వెంకట్ —కన్వీనర్
- పీ. లక్ష్మణ్ రావు,నరేందర్, శ్రీనివాస్, సి.హెచ్. వెంకటేశ్వరావు,మహ్మద్. అతీఖ్ పాషా, పి.సురేందర్ రెడ్డి, బి.సంతోష్, మహేష్, కె.బాల నర్సింగ్ రావు
- TGEJAC హైదరాబాద్ సిటీ బాడీ మొదలగువారు పాల్గొన్నారు.

# ఒక బీసీ మహిళా మంత్రి కొండా సురేఖ మీద పెద్ద ఎత్తున కుట్రలు చేయడం సరికాదు

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

ఒక బీసీ మహిళా మంత్రి అయిన కొండా సురేఖపై జరుగుతున్న పరిణామాలు,మా కుమ్మడి దాడులు మరియు రాజకీయ కుట్రలు ఏమాత్రం సమర్థనీయం కాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీలో గతంలో పలువురు నాయకులు ఇంత కంటే తీవ్రంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నప్పటికీ,అప్పుడు స్పందించని పార్టీ నాయకత్వం ఇప్పుడు ఒక బీసీ మహిళా మంత్రి విషయంలో మాత్రమే ఇంత తీవ్రంగా స్పందించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు.ఒక బీసీ మహిళ రాజకీయంగా ఎదిగి మంత్రి స్థాయికి చేరుకోవడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారనీ అన్నారు.ఒక బీసీ మహిళా మంత్రిని రాజకీయంగా బలహీనపరిచే కుట్రలను వెంటనే నిలిపివేయాలని,ఆమెపై వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పునరాలోచించాలని జాజుల లింగంగౌడ్ కోరారు.బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా బీసీ జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనీ బలహీన వర్గాల



ప్రజాప్రతినిధులకు అండగా నిలుస్తామని ఈ సందర్భంగా లింగం గౌడ్ పేర్కొన్నారు

# ఒక బీసీ మహిళా మంత్రి కొండా సురేఖ మీద పెద్ద ఎత్తున కుట్రలు చేయడం సరికాదు

- **బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

ఒక బీసీ మహిళా మంత్రి అయిన కొండా సురేఖపై జరుగుతున్న పరిణామాలు, మాకుమ్మడి దాడులు , రాజకీయ కుట్రలు ఏమాత్రం సమర్థనీయం కాదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీలో గతంలో పలువురు నాయకులు ఇంతకంటే తీవ్రంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నప్పటికీ,అప్పుడు స్పందించని పార్టీ నాయకత్వం ఇప్పుడు ఒక బీసీ మహిళా మంత్రి విషయంలో మాత్రమే ఇంత తీవ్రంగా స్పందించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఒక బీసీ మహిళ రాజకీయంగా ఎదిగి మంత్రి స్థాయికి చేరుకోవడాన్ని కొందరు జీర్ణించుకోలేక పోతున్నారనీ అన్నారు.ఒక బీసీ మహిళా మంత్రిని రాజకీయంగా బలహీనపరిచే కుట్రలను వెంటనే నిలిపివేయాలని, ఆమెపై వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పునరాలోచించాలని కోరారు.బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా బీసీ విద్యార్థి సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందనీ బలహీన వర్గాల



ప్రజాప్రతినిధులకు అండగా నిలుస్తామని ఆయన అన్నారు.

# ఘనంగా హైదరాబాద్ లో సస్టెయిన్‌ఎక్స్ 2026 సదస్సు



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**

స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుత నాయకత్వం, భవిష్యత్‌కు సిద్ధమైన సంస్థల నిర్మాణంపై సమగ్ర చర్చలకు వేదికైన సస్టెయిన్‌ఎక్స్ (SustainX) వార్షిక సదస్సు 2026 హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టీఎఫ్ఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సంస్థల ఉన్నతాధికారులు, నిపుణులు, సామాజిక రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సుస్థిరతను కేవలం పర్యావరణ పరిరక్షణకే పరిమితం చేయకుండా ఏఐ సాంకేతికత, సంస్థాగత నాయకత్వం, మౌలిక వసతులు, సుస్థిర కొనుగోళ్లు, భవిష్యత్ కార్యాలయాలు, ఆరోగ్య రంగం, సీఎస్ఆర్, పౌర సేవలు, సుస్థిర పర్యాటకం వంటి విభిన్న అంశాలపై జరిగిన చర్చలు సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీఎఫ్ఎంసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాథల సత్యనారాయణ స్ఫూర్తిదాయక ప్రసంగంతో సదస్సు అధికారికంగా ప్రారంభమైంది.జీసీసీ కాన్క్లేవ్ ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. సుస్థిర సంస్థల నిర్మాణంలో జీసీసీల మారుతున్న పాత్ర" అనే అంశంపై విస్తృత చర్చ జరిగింది. హైదరాబాద్‌లో మౌలిక వసతుల భవిష్యత్తుపై పర్యావరణ పరిరక్షణపై ఐఏఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల (ITE&C) శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టిఅనుదీప్ అభివృద్ధిదారులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు. అలాగే ప్రొక్యూర్‌మెంట్ కాన్క్లేవ్‌లో విలువ, మౌలిక వసతుల స్థిరత్వం, సుస్థిర కొనుగోళ్లపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజలు, సాంకేతికత, ఆరోగ్యం, సామాజిక బాధ్యత అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. నటుడు డాక్టర్ భద్రం, ఆరోగ్య భద్రతపై నిర్వహించిన వన్ లైఫ్ సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది. హెచ్‌ఆర్ కాన్క్లేవ్‌లో భవిష్యత్ కార్యాలయాలపై చర్చలు జరిగాయి. కిమ్స్ హాస్పిటల్స్ ప్రతినిధులతో ఆరోగ్య రంగ నాయకత్వంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.

## సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం

సీఎస్ఆర్ కాన్క్లేవ్‌లో బాధ్యతాయుత నాయకత్వంతో బలమైన సమాజ నిర్మాణంపై చర్చ జరిగింది. సర్వేజన ఫౌండేషన్ కార్యక్రమాలపై ప్రజెంటేషన్‌తో పాటు సామాజిక కార్యక్రమాలపై ప్రత్యేక ప్రసంగాలు జరిగాయి. టీఎఫ్ఎంసీ కేర్స్ ఆధ్వర్యంలో 'సపోర్ట్ ది గర్ల్ చైల్డ్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.యాదాద్రి, పోచంపల్లి ప్రాంతాలను సుస్థిర పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలపై కూడా ప్రత్యేక ప్రదర్శనలు జరిగాయి. సాయంత్రం లాయిడ్స్‌కు చెందిన ఎలిజబెత్ ప్రత్యేక ప్రసంగం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు సివిక్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేయగా, కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ లీడర్‌షిప్ టాక్ నిర్వహించారు. సాంకేతికత, సంస్థల అభివృద్ధి, సేవా నాణ్యత, బాధ్యతాయుత వృద్ధి అంశాలపై అనుదీప్ దురిశెట్టి దిశానిర్దేశం చేశారు. సదస్సు ముగింపు సందర్భంగా వ్యాపార ప్రదర్శనలు, నెట్‌వర్కింగ్ జోన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యూజన్ డ్యాన్స్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.ప్రభుత్వ విధానాలు, పరిశ్రమ, సాంకేతికత, మౌలిక వసతులు, ఆరోగ్యం, సీఎస్ఆర్, పౌర సేవలు, పర్యాటకం వంటి రంగాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సుస్థిర ఆలోచనలను కార్యాచరణాత్మక భాగస్వామ్యాలుగా మార్చడమే సస్టెయిన్‌ఎక్స్ 2026 ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.





# వీర్లగడ్డ తండా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- **ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకే పల్లె పల్లెకు పొన్నం అన్న - మంత్రి పొన్నం ప్రభాకర్**

**హనుమకొండ జిల్లా, వెలుతురు ఆగస్టు 21:**
భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండా గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్థుల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం గ్రామ ప్రజల నుంచి గ్రామ సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించి, అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీర్లగడ్డ తండా ప్రగతి నివేదిక ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.

- **గ్రామంలో 211 రేషన్ కార్డులు పంపిణీ చేయగా, లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.**
- **37 మందికి పెన్షన్లు అందుతున్నాయి.**
- **8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 6 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 2 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.**
- **48 భూభారతి దరఖాస్తులు రాగా, 42 దరఖాస్తులు పరిష్కరించారు.**
- **141 కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోంది.**
- **66 కుటుంబాలకు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద రూ.37,211 విడుదల చేశారు.**
- **13 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు వడ్డీలేని రుణాల కింద రూ.3.75 లక్షలు విడుదల చేశారు.**
- **రైతు బీమా కింద ఇద్దరు రైతులకు రూ.10 లక్షలు అందించారు.**
- **239 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.2.26 కోట్లు మాఫీ చేశారు.**
- **కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 62 మంది లబ్ధిదారులకు 62 చెక్కులు అందించారు.**

అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.

### మూతపడిన పాఠశాల పునఃప్రారంభం

గ్రామంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులను చేర్పించేలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులు, గౌరవెల్లి ప్రాజెక్టు పిల్ల కాలువలు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలపై కూడా గ్రామస్థులు వినతిపత్రాలు అందజేశారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

### గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

"పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం గ్రామాల్లో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా కలిసి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి గ్రామంలో ఏదో ఒక సమస్య ఉంటుందని, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ సూచనలు, విజ్ఞాపనలు అందిస్తుంటారని తెలిపారు. గ్రామ సమస్యలను అధికారుల సమక్షంలోనే తెలుసుకుని, వాటిని జాబితా రూపంలో నమోదు చేసి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయో తెలుసుకోవడంతో పాటు, గ్రామానికి ఇంకా అవసరమైన మౌలిక వసతు లు, అభివృద్ధి పనులపై ప్రజల సూచనలు తీసుకుని గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

### వర్షపు నీటిని సంరక్షించుకోవాలి

ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి చుక్క వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటేనే వ్యవసాయం, పంటల దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. భూమిలో కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న లావుడ్య మంగ్యను మంత్రి అభినందించారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సహాయం గురించి అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు కొత్తగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, హెచ్ఐవీ, బోదకాలు తదితర అర్హతలు కలిగిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.రక్తహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న అర్హులైన వారికి కూడా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య సేవలపై అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణ, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని మంత్రి తెలిపారు.

### ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

గ్రామంలో 22 ఓట్లు "అనమైల్" కింద ఉన్నట్లు గుర్తించామని అధికారులు మంత్రికి తెలిపారు. సంబంధిత ఓటర్లు తమ వివరాలను సరిచేసుకునేలా అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### జల సిరి తో నీటి భద్రత



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జలశ్రీ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి, ప్రతి పంటకు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే లక్ష్యమని అధికారులు వివరించారు. వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంచడం, గ్రామాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్‌లో తాగునీరు, సాగునీటి సమస్యలను తగ్గించేందుకు జలశ్రీ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

### పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ పొదుపు

గ్రామస్థులు పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకుని తమ ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధి కారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలు, అవసరాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూగులోతు పూర్ణిమ– రాజు, జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తప్పులు దొర్లితే ఎవరినీ ఉపేక్షించేది లేదు




- **విధుల్లో నిర్లక్ష్యంపై ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సస్పెన్షన్‌కు ఆదేశం**
- **ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష సమీక్ష**

**వెలుతురు హైదరాబాద్, జగిత్యాల ఆగస్టు 21:**
ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అవినీతి, విధుల్లో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇకపై రెవెన్యూ, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు, నిర్వహిస్తానని, నిఖీల్లో తప్పులు దొర్లితే ఎవరినీ ఉపేక్షించబోనని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి సుమారు నాలుగు గంటల పాటు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు, భూ రీ సర్వే, 22–ఏ కేసులు, భూ భారతి దరఖాస్తులు, అసైన్డ్ భూముల సమస్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈరోజు సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలను ఈరోజు నుంచే కార్యాలయాల్లో అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష కేవలం మొదటి సమావేశం మాత్రమేనని, ఇకపై ఆకస్మిక తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

### తహసీల్దార్ సస్పెన్షన్‌కు ఆదేశం

విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి గారు ఆదేశించారు. మరికొంత మంది అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు."అధికారులు పద్ధతి మార్చుకోవాలి.. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు" అని మంత్రి గారు హెచ్చరించారు.అధికారులు తమకు కేటాయించిన హెడ్‌క్వార్టర్లలో నివాసం ఉంటున్నారా లేదా అనే అంశంపై నివేదిక తెప్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.ప్రజలతో అధికారులు, సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. . ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలన్నారు.క్షేత్రస్థాయిలో చిన్న రెవెన్యూ సమస్యను కూడా అధికారులు గుర్తించి పరిష్కరించాలన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖపై ఉన్న అవినీతి మచ్చను చెరిపేలా అధికారులు పనిచేయాలని అన్నారు. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలితే సస్పెన్షన్‌తో సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు మహిళ ఫిర్యాదు చేసిన ఘటనపై సంబంధిత తహసీల్దార్‌కు ఛార్జ్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్లకు సమాచారం ఇవ్వకుండానే ఆకస్మిక తనిఖీలకు వస్తానని మంత్రి స్పష్టం చేశారు.రీ సర్వే, ఇందిరమ్మ ఇళ్లపై వేగంభూ రీ సర్వే పనులను పెండింగ్‌లో పెట్టే అధికారులపై చర్యలు తప్పవన్నారు. లైసెన్సు సర్వేయర్లకు ప్రతి 15 రోజులకు ఎకరాకు రూ.60 చొప్పున చెల్లించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలోని ఎల్–3 సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని, రెండో దశ ఇళ్ల మంజూరుకు ముందు లబ్ధిదారుల అర్హతను రెండుసార్లు పరిశీలించాలని ఆదేశించారు. 22–ఏ, అసైన్డ్ భూముల కేసులను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే 24 గంటలూ పనిచేసి కేసులను పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశం ప్రారంభం మాత్రమేనని.. ఇకపై కార్యాలయాల పనితీరు, అధికారుల విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



# పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన

- **గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్..**

**భీమదేవరపల్లి వెలుతురు ఆగస్టు 21:**
హుస్నాబాద్ నియోజకవర్గంలో భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్థుల సమక్షంలో అధికారులతో సమీక్షా..అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలు ,వ్యక్తిగత సమస్యల పై వినతి పత్రాలు స్వీకరించి అధికారులతో మాట్లాడి సమస్యా పరిష్కారానికి చర్యలు తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- **ప్రజా పాలన ప్రభుత్వంలో మల్లారం గ్రామ ప్రగతి నివేదిక**
- **గ్రామంలో 1280 రేషన్ కార్డులు పంపిణీ చేయగా వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం**
- **383 పెన్షన్లు వస్తున్నాయి.. కొత్త పెన్షన్లకు ఈనెల 31 తేదీ వరకు అప్లికేషన్లు జరుగుతున్నాయని 7 రకాల పెన్షన్లు వితంతు,ఒంటరి మహిళలు, దివ్యాంగులకు,గీతా,చేనేత కార్మికులు బోదకాలు, తలసేమియా,HIV,పేషంట్ లకు పెన్షన్లు అప్లై చేసుకోవాలి**
- **గ్రామానికి 13 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా .. ఇల్లు పూర్తయ్యాయి..2 వ దశ ఇందిరమ్మ ఇల్లు పెండింగ్ లో ఉన్నాయి**
- **824 కుటుంబాలకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం**
- **943 కుటుంబాలకు మహా లక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద అందుతుంది**
- **Shg 64 గ్రూప్ లకు వడ్డీలేని రుణాలు విడుదల చేయడం జరిగింది**
- **1230 కుటుంబాలకు రైతు భరోసా పథకం కింద నిధులు విడుదల అయ్యాయి..**
- **రైతు భీమా కింద ఇద్దరు రైతులకు 10 లక్షలు విడుదల చేయడం జరిగింది..**
- **1230 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద మాఫీ చేయడం జరిగింది**
- **కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ లకు 62 మంది కి 62 చెక్కులు విడుదల చేయడం జరిగింది..**
- **మల్లారం గ్రామంలో పలు సమస్యల పై మంత్రి గారి దృష్టికీ తీసుకొచ్చిన గ్రామస్థులు..**
- **ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామాల్లో పర్యటనలు -మంత్రి పొన్నం ప్రభాకర్**
- **వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలి**
- **రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి**



- **ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం ..సర్పంచ్ 10 ఎకరాలకు 5 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు వారికి అభినాదనలు**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.. ఈనెల 31 వరకు పెన్షన్లు అప్లికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది..అర్హులు అప్లై చేసుకోవాలి**
- **గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ఆశా ల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకొని వైద్యారోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం.**
- **గ్రామంలో 141 మందికి బీపీ ఉంది వారికి నెల నెల మందులు సిబ్బంది అందిస్తున్నారు..**
- **పీఎం సూర్య ఘర్ ద్వారా మన ఇంటిపై ఉన్న సూర్య శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడం..**
- **ప్రతి ఒక్కరు జలసిరి కార్యక్రమం ద్వారా ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి**
- **గ్రామాల్లో స్టీల్ బ్యాంక్ వాడుకోవాలి..ప్లాస్టిక్ నిషేధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..**
- **పిల్లలకు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.. హుస్నాబాద్ లో కబడ్డీ అకాడమీ మంజూరు అయింది..**
- **ఎల్ నినో ప్రభావం తో వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవాలి..**
- **కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ,జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ ప్రజలు,రైతులు, మహిళా సంఘాలు**



## ఐకమత్యమే బలం, అభివృద్ధే లక్ష్యం మండల కాంగ్రెస్ సారథులకు "వేం" దిశా నిర్దేశం

- వేం అన్న"ను కలిసిన నూతన మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్, ఎదళ్ల యాదవరెడ్డి, బైరు అశోక్ గౌడ్...
- అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా...
- కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్...

**కేసముద్రం వెలుతురు ఆగస్టు 21:**





మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాలలో నూతన అధ్యక్షులుగా ఎన్నికైన చిలువేరు సమ్మయ్య గౌడ్,ఎదళ్ల యాదవరెడ్డి, బైరు అశోక్ గౌడ్ లు రాజ్యసభ సభ్యులు ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అందుకున్నారు. ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేం మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేసి మానుకోట గడ్డను కాంగ్రెస్ అడ్డగా మార్చాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానుకోట జిల్లాకు వందల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి కనీ విని ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. వాటిని ప్రజలకు వివరించాలని సంక్షేమ పథకాలను తెలియపరచాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహించవద్దని అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు నడవాలని సూచించారు. ఎవరైనా పార్టీని బలహీనపరచడానికి కుట్రలు పన్నిన తనకు తెలియపరచాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఎమ్మెల్యే,ఎంపీ, భూక్య ఉమా, భరత్ చందర్ రెడ్డి ల సలహాలు సూచనలు తీసుకుంటూ ముందుకు నడవాలన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పల కాపాడుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీని మానుకోటలో ఇతర ఏ పార్టీలు కూడా అందుకోలేనంత కార్యకర్తల బలంతో ఎదగాలన్నారు. అనంతరం నూతన మండల అధ్యక్షులు అయిన కేసముద్రం మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ను, ఇనుగుర్తి మండల అధ్యక్షులు బైరు అశోక గౌడ్, నెల్లికుదురు మండల అధ్యక్షుడు ఏదళ్ల యాదవరెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షులు వేం నరేందర్ రెడ్డిని సన్మానించారు.

**చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తానని చిలువేరు సమ్మె గౌడ్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించినందుకు ఎంపీ వేం నరేందర్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్ కు, స్థానిక ఎంపీ బలరాం నాయక్ కు ఎమ్మెల్యే మురళి నాయక్ కు, జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమా కు, భరత్ చందర్ రెడ్డి కి,చైర్మన్ గంట సంజీవరెడ్డికి,మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తన పై బాధ్యత ను మరింత పెంచిందని ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, తనకు అప్పగించిన బాధ్యత లక్ష్యంగా పని చేస్తానని ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు.అలాగే మరో పది రోజులలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పాత అధ్యక్ష కార్యదర్శులు అందరు కలిసిరావాలని పిలుపునిచ్చారు.మండలంలో అభివృద్ధి ఎంత నాణ్యతగా జరుగుతుందో అలాగే వేం నరేందర్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ గా జరగబోయే ఎన్నికలలో సత్తాచాటి ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించింది-మంత్రి వాకిటి శ్రీహరి

- రాజకీయ కక్షతోనే పర్యటనను అడ్డుకున్నారు: మంత్రి వాకిటి శ్రీహరి
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి- మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. కేంద్రం కావాలని సిఎం పర్యటనను అడ్డుకున్న బీజేపీ ఎంపీలు రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్‌లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ని పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యా రంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యా సంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాలపై చర్చించాలన్నది సీఎం లక్ష్యమని పేర్కొన్నారు.అమెరికా పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా పంపించినప్పటికీ, రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం దురదృష్టకరమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలను కూడా రాజకీయాలకు అతీతంగా చూడలేని స్థాయికి బీజేపీ దిగజారిందని విమర్శించారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచస్థాయి విద్యా సంస్థలను తెలంగాణకు తీసుకురావాలని ప్రయత్నిస్తుంటే.. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలతో కాలం గడుపుతున్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు" అని మంత్రి అన్నారు. తెలంగాణలోని బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యా అవకాశాలు కల్పించేందుకు సీఎం వెళ్తే మాత్రం అడ్డంకులు సృష్టిస్తారా?" అని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన మరోసారి బహిర్గతమైందని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణను చూసి రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడం ద్వారా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. "విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయాలు చేయడం మానుకోవాలి.

## మండల రెవెన్యూ కార్యాలయంలో టాయిలెట్ ను శుభ్రం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

- పెంట్లవెల్లి మండల రెవెన్యూకార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ
- రికార్డులను పరిశీలించిన మంత్రి
- అధికారుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ లో జాప్యంపై తీవ్ర ఆగ్రహం


**పెంట్లవెల్లి వెలుతురు ఆగస్టు 21:**



పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కార్యాలయంలోని టాయిలెట్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి స్వయంగా తానే దానిని శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి హితవు పలికారు. అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయారు. అనంతరం పారిశుద్ధ్య సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు. కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత మంత్రి స్పష్టం చేశారు.

## ప్రముఖ సీనియర్ నటి షావుకారి జానకి గారి మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంతాపం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 21:**



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి, పద్మశ్రీ షావుకారి జానకి గారి మృతి పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .."షావుకారి జానకి గారు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి, తన సహజసిద్ధమైన నటనతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కథానాయకిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ చిరస్మరణీయం. 'షావుకారి' చిత్రంతో ప్రారంభమైన ఆమె నట ప్రస్థానం భారతీయ సినిమా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం" అని కొనియాడారు.ఆమె మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకే కాకుండా మొత్తం భారతీయ సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. షావుకారి జానకి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రసూల్‌పల్లి అభివృద్ధికి పెండింగ్ పనులకు ప్రాధాన్యత

- గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్న ప్రజా పాలన ప్రభుత్వం
- రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**రసూల్‌పల్లి వెలుతురు ఆగస్టు 21:**

హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం రసూల్‌పల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలు తెలిపిన సమస్యలు, వ్యక్తిగత సమస్యలను అధికారులతో చర్చించి, సాధ్యమైన వాటికి తక్షణ పరిష్కారం చూపేలా మంత్రి అధికారులను ఆదేశించారు.

**రసూల్‌పల్లి గ్రామ ప్రగతిపై నివేదిక**

- ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రసూల్‌పల్లి గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా గణనీయమైన ప్రయోజనం చేకూరిందని అధికారులు తెలిపారు.
- గ్రామంలో 63 మందికి పెన్షన్లు అందుతుండగా, రూ.17.63 లక్షలు విడుదల చేశారు.
- 332 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.2.31 కోట్లు విడుదల చేశారు.
- రైతు భరోసా కింద రెండు కుటుంబాలకు రూ.10 లక్షలు విడుదల చేశారు.
- 6 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.31.20 లక్షలు అందించారు.
- SHG బ్యాంకు లింకేజీ కింద రూ.12 లక్షలు విడుదలయ్యాయి.
- 94 కుటుంబాలకు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద రూ.74,992 విడుదలయ్యాయి.
- మొదటి దశలో మంజూరైన 8 ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయి. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటారు.
- గ్రామ ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోంది.

**రసూల్‌పల్లి–వీర్లగడ్డ తండా రహదారికి బ్రిడ్జి**

రసూల్‌పల్లి నుంచి వీర్లగడ్డ తండాకు వెళ్లే మార్గంలో లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.54 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా రసూల్‌పల్లి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.65 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

**రోడ్లు, పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు**

రసూల్‌పల్లి–మల్లారం రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.86 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. మంజూరైన నిధులతో పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని, భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.గ్రామంలోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

**రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన**

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను ఒడిసిపట్టే విధంగా జల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. చెరువులు, కుంటలు, కాలువలు, పంట పొలాల్లో నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

**ప్రభుత్వ భవనాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు**

భవిష్యత్తులో విద్యుత్ ఖర్చును తగ్గించుకునేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగకరమని మంత్రి తెలిపారు.గ్రామంలోని పంచాయతీ భవనం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి కుటుంబం కూడా తమకు సాధ్యమైన మేరకు సోలార్ విద్యుత్‌ను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి**

మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు.మహిళా సంఘాలకు అందించిన స్టీల్ సామగ్రిని ఉపయోగించుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే కార్యక్రమాలు చేపట్టాలని, వారికి అవసరమైన శిక్షణ, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలను మరింతగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, మహిళా సంఘాల ద్వారా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు.

**అంగన్‌వాడీ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ**



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అన్నారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, దోమల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం కేవలం ప్రభుత్వ పథకాలను వివరించడానికి మాత్రమే కాదని, ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలు తెలిపే ప్రతి సమస్యను నమోదు చేసుకుని, సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిధులు అవసరమైన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, యువత, రైతులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేసి రసూల్ పల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతు, మహిళ, యువత, విద్యార్థి, వృద్ధుడు.. ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని మహేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమం..

# భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులను సెప్టెంబర్ 15లోగా తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మొత్తం ఆరు కార్యాలయాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునిక వసతులతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.



### సెప్టెంబర్ 15లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. L1, L2, L3 వంటి సాంకేతిక వర్గీకరణల కంటే అర్హతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిజమైన పేదలకు ఇళ్లు అందేలా శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల సెప్టెంబర్ 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కూడా తుది చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా మరోసారి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.

### భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వే అత్యంత కీలకమైన కార్యక్రమమని మంత్రి పొంగులేటి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని, అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు మ్యాప్ అందిస్తే భవిష్యత్‌లో డిస్ప్యూట్‌లకు అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ఇది రెవెన్యూ శాఖలో కొత్త శకానికి నాంది పలికే కార్యక్రమమని, కలెక్టర్లకు అనుభవంతో కూడిన ఉన్నత సవాలు అని అన్నారు. సర్వే నిర్వహించే సర్వేయర్లకు నిర్ణీత మొత్తాన్ని ప్రతి 15 రోజులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

### రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానాలు

రిజిస్ట్రేషన్ శాఖలో పాత తరహా విధానాలకు స్వస్తి పలికి ప్రజలకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలు అందించే కొత్త విధానాలను తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అసైన్డ్ భూముల అంశంపై శాసనసభలో విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

### నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీకి రూ.32 కోట్లతో మౌలిక వసతులు

నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8,079 మంది లబ్ధిదారులకు రూ.227.32 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టండి

- **సోమర్‌విల్ కాలేజీలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా చిత్రపటాన్ని సందర్శించిన సీఎం రేవంత్**

**లండన్, వెలుతురు ఆగస్టు 21, 2026:**

తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని లండన్ లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ ఆహ్వానం పలికారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత లండన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు.తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే.అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శిం చారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపా యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబ డులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు...

అమెరికాలోని విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే జరిగిన సంప్రదింపుల మేరకు, ఆయా సంస్థలతో అవగాహన ఒప్పందాలు (MoUs) పూర్తి చేయడానికి అధికారుల బృందం పర్యటనను కొనసాగించనుంది. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, మరియు వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలని, ఉస్మానియా, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ వంటి విశ్వవిద్యాలయాలతో పాటు అగ్రశ్రేణి సంస్థల ఏర్పాటుతో రాష్ట్రాన్ని అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మారుస్తామని తెలిపారు.

సాధారణ భారతీయులు కూడా హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుండి విద్య, సర్టిఫికేషన్ పొందాలన్నదే తన సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# ఆక్స్‌ఫర్డ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

ఆక్స్‌ఫర్డ్ అను బంధ వి ద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు.సమావేశంలో మాజీ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికా రులు, ప్రతినిధులు. తెలంగా ణకు సంబంధించిన పలు అం శాలు,, విద్య, ప్రజా విధానాలపై చర్చలు ప్రారంభమ య్యాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారు.

# మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 21:**

మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 127 – రంగారెడ్డి నగర్ డివిజన్ లోని ఇందిరా గాంధీ నగర్ లో సుమారు 48.00 లక్షల రూపాయలు, గురుమూర్తి నగర్ లో 29.00 లక్షలు, గిరి నగర్ లో 90.00 లక్షలు, రంగారెడ్డి నగర్ లో 60.00 లక్షల రూపాయలు, పంచశీల కాలనీలో 22.70 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలకు అందుతున్న మౌళిక వసతులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని అన్నారు.మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల మార్పు, త్రాగునీటి సరఫరా పెంపు, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు కాలనీల భద్రతకై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందన, పోలీస్




అధికారులు ఏసీపీ గిరి ప్రసాద్, సీఐ శ్రీనివాస్ రావు, వాటర్ వర్క్స్ డీజీఎం వికాస్, ఏఈ అభిరామ్, మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, స్థానిక నాయకులు ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, ఎర్వ సాయికిరణ్ (బంటి), గౌసుద్దీన్, ఇబ్రహీం, సురేష్ గౌడ్, సంపత్, సాయి నేత, ఆంజనేయులు, నాగార్జున, విజయ్ పాల్గొన్నారు.

# క్వాంటం వ్యాలీ.. కొత్త అవకాశాలకు వేదిక: మన్నవ మోహనకృష్ణ

**ఆంధ్రప్రదేశ వెలుతురు ఆగస్టు 21:**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలు, టెక్నాలజీ రంగంలో తీసుకొస్తున్న మార్పులు, అమరావతి అభివృద్ధి ప్రణాళికలను అమెరికాలోని పారిశ్రామికవేత్తలకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వివరించారు. న్యూజెర్సీలో ప్రవాసాంధ్ర ఐటీ పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ చొరవతో ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక టెక్నాలజీ రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని మన్నవ మోహన కృష్ణ తెలిపారు. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేయనున్న 'క్వాంటం వ్యాలీ' రాష్ట్ర టెక్నాలజీ ప్రస్థానంలో కీలక అడుగుగా నిలుస్తుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్, పరిశోధన, ఆవిష్కరణల వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు ఇది వేదికగా మారనుందని పేర్కొన్నారు. "చంద్రబాబు నాయకత్వంలో గతంలో హైదరాబాద్ ఐటీ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఇప్పుడు అదే దార్శనికతతో అమరావతిని భవిష్యత్ టెక్నాలజీకి కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం మన ముందుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్య లు ఏపీని పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారు స్తున్నాయి. అమెరికాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార అనుభవాన్ని, పెట్టుబడులను రాష్ట్రంతో అనుసంధానం చేసుకోవాలి" అని మన్నవ మోహనకృష్ణ అన్నారు.





U.S.–INDIA CORRIDOR
EMPLOYEE MATCHING GRANTS CHECKLIST
RED FLAG / EVIDENCE / POSSIBLE VIOLATION / WHICH AUTHORITY TO REPORT TO

USE THIS CHECKLIST TO ENSURE YOUR DONATION AND EMPLOYER MATCH ARE LEGITIMATE, TRANSPARENT AND COMPLIANT

**THE FLOW**
Employee (U.S./NRI) → Donation to Indian Organization → Employer Matching Grant

**U.S. RULES (KEY POINTS)**
- Employer matches only per its written policy.
- IRS rules prohibit political campaign intervention.
- Donations must be to eligible charitable organizations.
- Misrepresentation can lead to tax, legal and employment consequences.

Ref: IRS.gov

**INDIA RULES (KEY POINTS)**
- FCRA regulates receipt and use of foreign contribution.
- Political parties generally cannot receive foreign funds.
- Funds must be used only for declared lawful purposes.
- Proper accounts, reporting and disclosures are mandatory.

Ref: MHA.gov.in | FCRAonline.gov.in

**WHO THIS COVERS**
- Indian Political Parties
- Religious / Missionary Organizations
- Swami / Baba / Spiritual Institutions
- Hospitals (including those run by trusts)
- Indian NGOs / Societies / Trusts / Section 8 Companies

| RED FLAG (WHAT TO WATCH FOR) | EVIDENCE TO LOOK FOR (WHAT PROVES IT) | POSSIBLE VIOLATION (EXAMPLES) | WHICH AUTHORITY TO REPORT TO |
|---|---|---|---|
| Donation money returned to employee after employer match ("Recycling" scheme) | • Bank transfers back to employee<br>• Cash withdrawals after match<br>• Internal emails/WhatsApp chats<br>• Acknowledgment of refund | • Misrepresentation to employer<br>• Fraud / Breach of trust<br>• False charitable contribution<br>• FCRA misuse (if foreign funds retained) | • Employer Ethics/Compliance<br>• IRS – Tax Exempt & EO Division<br>• Indian ECI (for political misuse)<br>• MHA – FCRA Division |
| Donation routed to political party directly or through an NGO | • Transfers to political party accounts<br>• NGO grants to political entities<br>• Purpose mentioned as political activities, campaigns | • Violation of employer policy<br>• Foreign contribution to political party (prohibited in India)<br>• FCRA violation | • Employer Compliance<br>• Election Commission of India (ECI)<br>• MHA – FCRA Division |
| Donation to religious/ missionary organization misrepresented as secular/charitable | • Organization's website & objects<br>• Use of funds for religious activities<br>• Communications with donor<br>• Matching grant application details | • Misrepresentation to employer<br>• Breach of matching policy (if religious orgs excluded)<br>• FCRA violation (if activities beyond declared purpose) | • Employer Compliance<br>• MHA – FCRA Division |
| Donation to Swami/ Baba/Spiritual Trust or Ashram (high-risk if policy excludes religion) | • Trust deed / objects clause<br>• Photos, videos of religious events<br>• Use of funds for spiritual activities<br>• Related party transactions | • Misrepresentation to employer<br>• Breach of policy<br>• FCRA violation (if funds used for religious/spiritual purposes beyond declared charitable work) | • Employer Compliance<br>• MHA – FCRA Division |
| Donation to Hospital run by religious trust or Baba organization (cover story risk) | • Hospital ownership documents<br>• Trust control of hospital<br>• Fund diversion to trust/ashram<br>• Payment to related entities | • Misrepresentation to employer<br>• Funds diverted to non-charitable religious activities<br>• FCRA violation | • Employer Compliance<br>• MHA – FCRA Division<br>• State Health Department (for hospital violations) |
| Donation to NGO with no real charitable work (shell or pass-through entity) | • Minimal or no activities on ground<br>• Same address for many NGOs<br>• Majority funds transferred onward<br>• No annual reports / poor accounts | • Misrepresentation to employer<br>• Money laundering (PMLA)<br>• FCRA violation<br>• Fraud | • Employer Compliance<br>• MHA – FCRA Division<br>• ED (Enforcement Directorate)<br>• Income Tax Department |
| False or incomplete information in matching grant application | • Mismatch in name, purpose, address<br>• False description of organization<br>• Missing legal status / FCRA details | • Misrepresentation / Fraud<br>• Violation of employer policy<br>• Possible tax consequences | • Employer Compliance<br>• IRS<br>• MHA – FCRA Division |
| Onward transfer to related/affiliated organizations without transparency | • Grants to related entities<br>• Common trustees/directors<br>• No public disclosure<br>• Layering of transactions | • Violation of FCRA conditions<br>• Diversion of foreign funds<br>• Breach of trust | • MHA – FCRA Division<br>• Income Tax Department |
| Mismatch between declared purpose and actual use of funds | • Expense statements<br>• Photos, invoices, programs<br>• Field verification reports<br>• Independent audits | • Violation of FCRA rules<br>• Breach of charitable purposes<br>• Criminal breach of trust | • MHA – FCRA Division<br>• State Charity Commissioner<br>• Income Tax Department |
| Employees repeatedly making large donations to same high-risk entity | • Pattern of donations & matches<br>• Same employees & same NGO<br>• Large amounts vs. income level | • Possible collusion<br>• Abuse of matching program<br>• Money laundering risk | • Employer Compliance<br>• MHA – FCRA Division<br>• FIU-IND (Financial Intelligence Unit) |

**IF YOU SUSPECT MISUSE – WHAT TO DO**
- Collect documents (receipts, emails, bank statements).
- Verify organization's status (FCRA, registration, activities).
- Check your employer's matching gift policy carefully.
- Raise concern through internal ethics/compliance channel.
- If unresolved, report to appropriate authorities.
- Do not participate in or assist any refund or pass-through.


**KEY AUTHORITIES – CONTACT POINTS**
- Employer Ethics / Compliance Office (First Point of Contact)
- IRS – Tax Exempt & Government Entities Division https://www.irs.gov/charities-non-profits
- MHA – FCRA Division, Government of India https://fcraonline.gov.in | https://www.mha.gov.in
- Election Commission of India (ECI) https://eci.gov.in
- Enforcement Directorate (ED) https://www.enforcementdirectorate.gov.in
- Income Tax Department, India https://www.incometax.gov.in
- State Charity Commissioner / Registrar of Societies

**SAFE & LEGIT DONATIONS – GOLDEN RULES**
Donate only to eligible, transparent, well-governed organizations.
- Ensure organization is FCRA registered (if receiving foreign funds) and compliant.
- Follow your employer's matching policy exactly.
- Never expect or accept a refund of your donation.
- Ensure funds are used for declared charitable purposes only.
- Keep all documents and communicate transparently.

**REMEMBER**
An employee match should multiply your genuine charity – not create corporate money through refunds or hidden arrangements.

BE TRANSPARENT. BE COMPLIANT. PROTECT YOUR EMPLOYER, YOURSELF & THE CAUSE.

This poster is for awareness and general guidance only, not legal advice. Always consult legal or compliance professionals for specific situations. April 2025




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com